teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 256 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 21 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



02


## ప్రపంచ ఆర్థిక సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు



02

## సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి ఊరట

పరువునష్టం కేసులో విచాచరణపై సుప్రీంకోర్టు స్టే




02

## కొత్తపుంతలు తొక్కుతున్న ఆన్‌లైన్ మోసాలు

చిన్నపాటి పొరపాటుతో ఖాతాల్లో డబ్బులు మాయం
సైబర్ నేరాలపై టీపోలీస్ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్



02

## పాఠశాల దశలోనే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం

తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ
రోడ్ సేఫ్టీ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలి




02

## గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ 2024 ప్రకటించిన సర్కార్

అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితా విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
ఈ నెల 26న గవర్నర్ చేతులమీదుగా ప్రదానం

### ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల్లో

# ఆరోపణలను బలపరుస్తున్న ఆధారాలు

## తీన్మార్ దినపత్రిక ర్యాండమ్ సర్వేలో వెలుగుచూసిన “అక్రమ” వాస్తవాలు

రాష్ట్రంలో పేదరికంలో ఉన్న, పేదరికానికి మరియు సౌకర్యాలకు మధ్య కొట్టు మిట్టాడుతున్న మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్వావలంబన, ఆర్థిక పురోగతి నేపథ్య గొప్ప ఉద్దేశ్యం గల ఈ ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ప్రోగ్రాం కార్యాచరణ అల్లకల్లోలంగా ఉన్నట్లుగా తీన్మార్ తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో సోమవారం (చేపట్టిన ర్యాండమ్ శాంపిల్ సర్వేలో) లభించిన కొన్ని ఆధారాలు కొన్ని ఆరోపణలను బలపరుస్తున్నాయి.

**కంచే చేనుమేస్తున్న చందాన**


**ఓ క్లస్టర్ కో ఆర్డినేటర్ దుశ్చర్య**

**అదే క్లస్టర్ కో ఆర్డినేటర్ సెంటర్ లోనే తప్పుడు ఫోటోల రిపోర్టింగ్**

తెలంగాణ బ్యూరో, జనవరి 20 (తీన్మార్ న్యూస్): ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల (CFL) నిర్వహణను ప్రస్తుతం తెలంగాణలో (VIDS) వాలెంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ అనే అనంతపూర్ హెడ్ ఆఫీస్ పేరుగల ఎన్జీఓ సంస్థ నిర్వహిస్తున్నది. ఒక్కో జిల్లాలో సుమారు 3 నుంచి 5 వరకు ఆర్థిక

మిగతా 2 లో




### ఆఫీస్ (CFL) అవసరాల ఖర్చుల్లో సీసీ చేతి వాటం

*CFL s కౌన్సిలర్స్ కి అందాల్సిన న్యాయమైన నిధులు, అవసరాలు న్యాయంగా చేరడంలేదు. దీనికి నిదర్శనం ఇక్కడ చూడవచ్చు. 2024 నవంబర్ నెలలో అన్ని CFL కేంద్రాలకు, ఆఫీస్ పరిశుభ్రత (చీపురు, ఇతర) అవసరాలకు సంస్థ ఒక్కో CFL కి 1300 రూ. కేటాయించగా రాష్ట్రంలోని కొన్ని ఏరియాల్లో పూర్తిగా కొందరు సీసీలు, ఏసీలు ధనార్జన లేకుండా అందించగా, (ఉమ్మడి) వరంగల్ ఏరియాలో గల సీసీ ద్వారా మాత్రం ఒక్కో CFL కు.. ఒక్కో సంఖ్య (అనగా 1300 రూ. కు గాను 500, 600, ఇదేం సరిపోతది అని ప్రశ్నిస్తే 800 రూ.) ఇచ్చినట్లు ఆధారాపూరిత సమాచారం. కనీస అవసరాలు తీర్చేందుకు కేటాయించిన స్వల్ప నిధులే మింగేస్తుంటే ఇంక అసలైన పెద్ద తలలు పెద్ద మొత్తాన్ని ఎం చేస్తారో అనేది తెలియాల్సి ఉంది. కాగా చివరికి ఈ ప్రాజెక్ట్ పై ఒక అభిప్రాయానికి రావాలి అనుకుంటే ఇది ప్రజా ప్రయోజన ప్రాజెక్ట.. లేక వ్యక్తిగత, కుటుంబ ఆర్థిక అభివృద్ధి ప్రత్యేక కార్యక్రమమా అనేది అంతుచిక్కడంలేదు, అనగా అర్థం కావడంలేదు.*

**మరింత ఇన్వెస్టిగేషన్ తో.. మరిన్ని ఆధారాలతో మరుసటి సంచికలో మరింత సమాచారం**




## మందుబాబులకు కేఎఫ్ బీర్ల సంస్థ శుభవార్త

**రాష్ట్రంలో కేఎఫ్ బీర్ల సరఫరా నిలిచిపోలేదని సమాచారం**

**కేఎఫ్ బిరర్లను తిరిగి ప్రారంభించాలని సంస్థ నిర్ణయం**


తెలంగాణ బ్యూరో, జనవరి 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణాలో కేఎఫ్ బీర్లు ఉ ండబోవన్న వార్తలతో మద్యం ప్రియులు ఎంత ఆందోళన చెందారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రభుత్వానికి, బీర్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ కి మధ్య ధరల విషయంలో అవగాహన కుదరకపోవడంతో ఇకపై తెలంగాణాలో కేఎఫ్ బీర్ల సప్లై నిలిచిపోనుందని

మిగతా 2 లో

## కాకుల్లా.. కార్మికుడికి కష్టం వస్తే కలిసి ఉద్యమించాలి

**రేవంత్ రెడ్డికి చుక్కలు చూపించాలి**

**కార్మికులకు కేటీఆర్ పిలుపు**



హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): ఒక్క కాకికి కష్టం వస్తే పది కాకుల ఎలాగైతే వాలిపోతాయో.. అలాగే ఒక్క కార్మికుడికి కష్టం వస్తే అందరూ కలిసి ఉద్యమించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ.. రేవంత్ రెడ్డికి చుక్కలు చూపించాలని కార్మికులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. ఇవాళ ఆవిష్కరించుకున్న క్యాలెండర్ తేదీలు మారే క్యాలెండర్‌గా ఉ ండిపోకూడదు.. పోరాటాలు చేసే క్యాలెండర్ కావాలి ఇది. ఆటో డ్రైవర్లకు హామీలు ఇచ్చిండు.. కానీ అమలు చేయడం లేదు. ఇవాళ ఆటో డ్రైవర్లు ఓఆర్ఆర్ బయట ఉండాలని అంటుండు. ఆటో వాళ్లకు బతుకుదెవురు లేకుండా చేస్తుండు. మే 1వ తేదీ లోపు 15 రోజులకు

మిగతా 2 లో




## నైని బొగ్గు గనుల ద్వారా మార్చి నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తాం

**డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క**

న్యూ ఢిల్లీ, జనవరి 20 (తీన్మార్ న్యూస్): నైని బొగ్గు గనుల ద్వారా ఈ సంవత్సరం మార్చి నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఒరిస్సా రాష్ట్రంలోని కోణార్క్‌లో జరుగుతున్న మూడో జాతీయ మైనింగ్ మంత్రుల సదస్సు సందర్భంగా ఒరిస్సా రాష్ట్ర సీఎం మోహన్ చరణ్ మాంజీతో డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఈ సందర్భంగా ఓ లేఖను సైతం ఆయనకు అందజేశారు. ఒరిస్సా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో

మిగతా 2 లో

## సాంస్కృతిక పునరుజ్జీవనానికి వీపీ ధంఖర్ పిలుపు



.. వివరాలు 2లో

## రైతు ఆత్మహత్యలు, పరిస్థితులపై అధ్యయన కమిటీ

**9 మందితో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు**

**తాజాగా ప్రకటించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



.. వివరాలు 2లో



## ఈనెల 25న ఘనంగా ఓటర్ల దినోత్సవం

**అన్ని రాజకీయ పార్టీలు చైతన్యం కార్యక్రమానికి సహకరించాలి**

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి**

హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఈనెల 25న జరిగే ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని, అందుకు అన్ని రాజకీయ పార్టీలు తాము నిర్వహించే ఓటరు చైతన్యం కార్యక్రమానికి

మిగతా 2 లో

# పాలకీడు ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షేనా..?

## నూతన భవనం శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా చర్యలు శూన్యం

- ఉప ఆరోగ్య కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మారేదెప్పుడు
- పాలకులు, అధికారుల మాటలు నీటి మీద రాతలేనా
- నిరీక్షణకు తెర పడేనా.. హామీలు నెరవేరేనా..?
- ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్న ప్రజలు
- ప్రత్యేక వైద్యుడికై ఎదురుచూస్తున్న 22 గ్రామాల ప్రజలు
- ఉన్నత వైద్యం అందుబాటులోకి తేవాలి
- మండల ప్రజల వేడుకోలు

సూర్యాపేట, జనవరి 20 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా పాలకీడు మండల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మారింది. అత్యవసర చికిత్సకు వేరే మండలాలైన నేరేడుచర్ల, మిర్యాల గూడకు పరుగెత్తి చికిత్స చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు దాటినా కొత్త మండలంగా ఏర్పడి 8 సంవత్సరాలు గడుస్తున్న అటు ప్రజా ప్రతినిధులు ఇటు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ ప్రతి పౌరుడికీ అందుబాటులో ఉండాలని మౌలికమైన ఆరోగ్య సదు-పాయాలను పౌరులందరికీ అందించడం కోసం ప్రభుత్వం వివిధ ఆరోగ్య పథకాలనూ, కార్యక్రమాలనూ ప్రవేశపెడుతోంది, అమలు చేస్తోంది. మహిళలు, పిల్లలు, వయోధికులు తదితరులతో సహా నిర్దిష్టమైన లబ్ధిదారుల కోసం ఉద్దేశించిన ఆరోగ్య కార్యక్రమాలు, విధానాలు, పథకాలు, వాటి స్వరూపాలు తదితరాల గురించి ఈ విభాగం సమాచారాన్ని అందిస్తుంది. కానీ ఈ పథకాలు, సౌకర్యాలు పాలకీడు మండలం ప్రజలకు నేటికీ అందని ద్రాక్షే... గత ప్రభుత్వంలో మండలం నిర్లక్షానికి గురైయింది అని ప్రస్తుత ప్రభుత్వం అయినా ప్రజా ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతారనుకుంటే పాలకుల, అధికారుల మాటలు హామీలు, పేపర్ ప్రకటనలకే పరిమితం అయ్యాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఉప ఆరోగ్య కేంద్రం పూర్తి స్థాయి ఆరోగ్య కేంద్రంగా మార్చి పూర్తి స్థాయి డాక్టర్ ని నియమించి మండలం లోని 22 గ్రామాలలో సుమారు 30 వేల నుండి 50 వేల మందికి ఉచిత వైద్యం అందేలా ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు చొరవ చూపాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు. అంబులెన్సు వాహనం ఉండి మండలానికి డాక్టర్, వైద్యం అందుబాటులో లేకుంటే ఉపయోగం ఏమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.




ప్రస్తుత మంత్రి ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం శంకుస్థాపన చేసి 6నెలలు గడుస్తున్నా నేటికీ జాడ లేదని, జిల్లా కలెక్టర్ ఇటీవల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక వైద్యుడి నియామకంపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించిన నేటికీ చర్యలు సూన్యం అని మండల ప్రజలకు ప్రజా ఆరోగ్యం ప్రశ్నర్థాకంగా మారింది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేవుడు వరమిచ్చినా... పూజారి కరుణించని చందంగా మారింది పాలకీడు ఆరోగ్య కేంద్రం పరిస్థితి.మారుముల గ్రామాల ప్రజలు అత్యవసర సేవల కోసం ప్రైవేట్ వాహనాల్లో నేరేడుచర్ల, మిర్యాలగూడ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం కోసం లక్షలు ఖర్చు చేస్తున్నారు. దీంతో పాటు కుక్కకాటు, ప్రసవాలు, రోడ్డు ప్రమాదాల బారినపడిన వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల గ్రామాలు గిరిజన తండాల దృష్ట్యా ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు వైద్యం అందేలా చూడాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాలకీడు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాన్ని ఆరోగ్య కేంద్రంగా మార్చి ప్రత్యేక వైద్యుడిని నియమించాలని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### పేద ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

**సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాష్**

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చి వైద్యులను సిబ్బందిని నియమించి సేవలందించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ డిమాండ్ చేశారు. మండలంలోని కృష్ణ పట్టి ప్రాంతాలైన మహంకాళి గూడెం రావిపాడు శూన్య పాడు గుండెబోయిన గూడెం, మీగడం పాడు తండా తదితర గ్రామాల ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలు అందుకోవాలంటే 25 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తుందని మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే గర్భిణులకు బాలింతలకు మరియు ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని, ఇప్పటివరకు ఆరోగ్య ఉప కేంద్రంలో ఆశా కార్యకర్తలు ఏఎన్ఎం తప్ప ఎవరూ అందుబాటులో ఉండటం లేదని మండలము ఏర్పడి 8 సంవత్సరం అవుతున్న ఆరోగ్య సేవలు మండల ప్రజలకు అందుబాటులో లేవని సుమారు 30 వేల జనాభా ఉన్న పాలకీడు మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని మరియు వైద్య సిబ్బంది డాక్టర్ మరియు ఏఎన్ఎంలు ఫార్మసిస్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి వైద్యుని ఏర్పాటుచేయాలని ఆరోగ్య శాఖను ఆదేశించిన కలెక్టర్ ఆదేశాలు అమలు చేయలేదని ఇప్పటికైనా ఆరోగ్య శాఖ దృష్టి పెట్టి ఆరోగ్య కేంద్రంగా మార్చి సేవలందించి పేద ప్రజలకు వైద్యం అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.



# ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల్లో ఆరోపణలను బలపరుస్తున్న ఆధారాలు

మొదటి పేజీ తరువాయి

అక్షరాస్యత కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 120కు పైగా సెంటర్స్ ని ఎస్టాబ్లిష్ చేసి ప్రజలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. దీనికిగాను ఒక్కో CFL సెంటర్ కు ఆయా మండల పరిధిలో ఓ బ్యాంకును స్పాన్సర్ గా ఏర్పాటు చేయబడింది.

### తెలంగాణలో CFLs ఏర్పాటు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) మరియు NABARD ప్రారంభించిన పైలట్ ప్రాజెక్టలో బాగంగా మొదట తెలంగాణలోని వికారాబాద్లో ఐదు ఆర్థిక అక్షరాస్యత (CFL\T) కేంద్రాలను ఏర్పాటు చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో CFLలను ఏర్పాటు చేశారు. CFLలు ఇలా రూపొందించబడ్డాయి.

### CFL s ఏర్పాటు ఉద్దేశ్యం

- మంచి ఆర్థిక పద్ధతులను ప్రోత్సహించడం.
- ఆర్థిక అవగాహన పెంచడం.
- స్థిరమైన ప్రవర్తన మార్పును ప్రోత్సహించడం.
- సమాచారంతో కూడిన ఆర్థిక ఎంపికలు చేయడంలో ప్రజలకు సహాయం చేయడం.
- ప్రజలు తమ ఆర్థికవ్యవహారాలపై మరింత నియంత్రణను పొందడంలో సహాయపడటం.
- అధికారిక ఆర్థిక సేవలను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియచేయడం.







(ఈ ఫొటోలో కనిపిస్తున్న బ్యానర్ ని పరిశీలిస్తే మీరు చదువుతున్నప్పుడు మీకు కుడివైపు బ్యానర్ ని గమనించండి)

### తప్పుడు ఫొటోలతో అక్రమ రిపోర్టింగ్

రోజు వారి కార్యాచరణలో భాగంగా అవగాహనా కార్యక్రమాలను వాస్తవ, కచ్చిత (రియల్ టైం) విధులను నిర్వహించాల్సి ఉంటుంది. అంతేకాకుండా కార్యక్రమం చేసినట్లుగా (సమయం, ప్రదేశం, జీపీఎస్ వివరాలతో) విధి విధానాల మేరకు కౌన్సిలర్స్ జీపీఎస్ టాగ్ తో ఫొటోస్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కాగా ఈ సంస్థలో ఎక్కువగా ఒక ప్రదేశంలో దిగిన ఫోటోను మరో ప్రదేశంలో, మరో సమయంలో దిగినట్లుగా వివరాలను సాంకేతిక పరిజ్ఞానంతో ఎడిట్ చేసి సమర్పిస్తున్నట్లుగా ఆధారాలు లభ్యంకావడం జరిగింది. ఈ ఫోటోలో ఒక కౌన్సిలర్ స్టేషన్ ఘన్ పూర్ లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన చేస్తున్నట్లు ఫోటో తో రిపోర్ట్ చేశారు. ఈ ఫోటో విషయానికి వస్తే అక్కడ ఉన్నవారు నిరసన తెలుపుటకు ఓ జిల్లాలో కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో వచ్చి వేచిచూస్తున్న సందర్భం, ఈ కౌన్సిలర్ వేరే జిల్లాలో, వేరే CFL సెంటర్ పరిధిలో కార్యక్రమం ఎలా చేశారు..? ఆ పరిధికి ఎందుకు వెళ్లాల్సి వచ్చింది, ఎవరితో వెళ్ళాడు పరిశీలిస్తే స్టేషన్ ఘన్ పూర్ CFL సెంటర్ కౌన్సిలర్ ఫోటో తీసినట్లుగా అతను క్లస్టర్ కో ఆర్డినేటర్ సంతోష్ అనే వ్యక్తితో విజిట్ వేరే జిల్లాలో CFL సెంటర్స్ విజిట్ చేసినట్లుగా సమాచారం.

దీని అర్థం ఈ సంస్థ నిర్వహణ, నియంత్రణ, సరిగ్గా లేకపోవడం చేతనా.. లేక సూపెర్విషన్ చేయు సీసీలు మరియు ఏసీల నిర్లక్ష్యం/అర్హత లేమి / అవగాహన లేమి /దురుద్దేశ బాధ్యతలా.. లేక అక్రమ సంపాదన ధ్యేయమా అనేది ఏదైనా కూడా పూర్తిగా ఎంతో గొప్పదైన ఈ ప్రాజెక్టు / ప్రోగామ్ ప్రాథమిక ఉద్దేశ్యాన్ని నీరుగారుస్తున్నది.

## మందుబాబులకు కేఎఫ్ బీర్ల సంస్థ శుభవార్త

మొదటి పేజీ తరువాయి

వార్తలొచ్చాయి. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం తెలంగాణాలో కేఎఫ్ బీర్ల సరఫరా నిలిచిపోలేదని తెలుస్తోంది. తెలంగాణలో కేఎఫ్ బీర్ల సరఫరా తిరిగి ప్రారంభించాలని నిర్ణయించినట్లు యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ తెలిపింది. ఈ మేరకు సోమవారం యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ అధికారిక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వంతో కీలక చర్చల తర్వాత కేఎఫ్ బీర్ల సరఫరాను మళ్ళీ ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపింది యునైటెడ్ బ్రూవరీస్. అయితే ప్రస్తుతం ఉన్న ధరలకే సప్లై చేస్తారా లేక ధరలు పెంచుతారా అన్నది ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ధరల విషయంపై త్వరలోనే సమాచారం ఇస్తామని తెలిపింది సంస్థ.

## కాకుల్లా.. కార్మికుడికి కష్టం వస్తే కలిసి ఉద్యమించాలి

మొదటి పేజీ తరువాయి

ఒక ప్రోగ్రాం తీసుకోవాలి. గిగ్ వర్కర్స్‌తో మీటింగ్ పెట్టాలి. ఆటో డ్రైవర్లు, గిగ్ వర్కర్లకు బడ్జెట్ పెట్టే విధంగా పోరాటం చేయాలి. కార్మిక దినోత్సవం రోజు వరకు అమలు కావాలి. కాకి కష్టం వస్తే.. అన్ని కాకులు గుమిగూడినట్లు మీరు ఏకం కావాలి. ఒక కార్మికుడికి కష్టం వస్తే అందరం కలిసి ఉద్యమించాలి. హైదరాబాద్ నగరంతో పాటు మిగతా జిల్లాల్లో కొత్త కమిటీలు వేసుకోవాలి. పోరాట పటిమ ఉన్నోళ్లు, రేవంత్ రెడ్డికి చుక్కలు చూపించే వాళ్లు రావాలి. ఎవరి మీద ఎక్కువ కేసులు అయితే వారు పెద్ద నాయకులు అవుతారు. పోయింది అధికారం మాత్రమే పోరాట పటిమ కాదు. 420 హామీలను అమలు చేసే దాకా వెంబడపడుదాం.. ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## కొత్తపుంతలు తొక్కుతున్న ఆన్‌లైన్ మోసాలు

తెలంగాణ బ్యూరో, జనవరి 20 (తీన్మార్ న్యూస్): ఆన్‌లైన్ మోసాలు రోజు రోజుకూ కొత్తపుంతలు తొక్కుతున్నాయి. చిన్నపాటి మీ పొరపాటుతో చాలా మంది ఖాతాల్లో డబ్బులు మాయం అవుతున్నాయి. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా అవగాహన కల్పిస్తూ తెలంగాణ పోలీస్ అధికారిక ఖాతా ఎక్స్ వేదికగా సోమవారం ఆసక్తికర పోస్ట్ పెట్టింది. ఒక్క క్లిక్ మీ జీవితాన్ని మార్చేస్తుందని సూచించింది. తక్కువ ధరకే వస్తువులు అంటూ సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను నమ్మకండని తెలిపింది. అత్యాశతో వెనుకా ముందు ఆలోచించకుండా లింక్ క్లిక్ చేయవద్దని సూచనలు చేసింది. మీ అత్యాశే సైబర్ నేరగాళ్ల పెట్టుబడని, తక్కువ ధరకు వస్తువులు అంటే అది ఖచ్చితంగా మోసమే అని గ్రహించాలని తెలిపింది. సైబర్ నేరాలపై అవగాహనే మీకు రక్ష అంటూ వెల్లడించింది.

## పాఠశాల దశలోనే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం



హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): పాఠశాల దశలోనే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం అని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ తెలిపారు. రోడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సింగిల్ లైన్, డబుల్ లైన్, హైవే రకరకాల రోడ్లు ఉంటాయని స్పీడ్ థ్రిల్‌గా ఉంటుందని కానీ అది ప్రాణాల్ని తీస్తుంది. యువత దీన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న రూల్స్ పాటిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. క్లాస్ రూమ్‌లో అనేక విషయాలు తెలుస్తాయని డాక్టర్, ఇంజనీర్ కావచ్చన్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై తెలంగాణలో అవైర్ నెస్ పార్కులు ఏర్పాటు చేయడం బాగుందని కితాబు ఇచ్చారు. ఆటలతో అనేక అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. ఫుట్‌బాల్‌తో సమాజంలో ఎలా బతకాలో ఒకరికి ఒకరు ఎలా సహాయం చేసుకోవాలో తెలుస్తుందన్నారు. పొలిటీషియన్ ఒక బోరింగ్ మీలో ఉన్న క్రియేటివిటీ బయటకు తీయండి అద్భుతమైన శాస్త్రవేత్తలు అవుతారని చెప్పారు. జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్. విద్యార్థి దశ నేర్చుకునే దశ ఈ దశలోనే సాంకేతిక, సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన చేసుకోవాలని విద్యార్థులకు గవర్నర్ హితవు పలికారు.

## నైని బొగ్గు గనుల ద్వారా మార్చి నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి



నైని బొగ్గు గనిని స్థాపించేందుకు ఒడిస్సా సీఎం కార్యాలయం నుంచి అద్భుతమైన మద్దతు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వ పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. గత సంవత్సరం జూలై 24న మీతో జరిగిన సమావేశాన్ని ఎప్పటికీ మర్చిపోలేను, ఆ చర్చలు ఫలవంతం అయ్యాయని తెలిపారు. నైని క్యాప్టివ్ బ్లాక్ అయినందున బొగ్గు గని నుంచి ఉత్పత్తి చేసిన బొగ్గును తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని 800 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు సరఫరా చేయాలి. జైపూర్ విద్యుత్ ప్లాంట్ నైనీ గని నుంచి దాదాపు 1000 కిలోమీటర్ల దూరంలో ఉంది. లాజిస్టిక్స్‌లో చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణి ఒడిశాలోని నైనా బొగ్గు గని సమీపంలో పిట్ హెడ్ ఓవర్ ప్లాంట్‌గా 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. దీని ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు, ఉత్పత్తి అయిన బొగ్గు లాభదాయకంగా ఉపయోగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నాం అని ఒరిస్సా సీఎంకు అందించిన లేఖలో భట్టి పేర్కొన్నారు. 20వ %జూూ% (ఎలక్ట్రికల్ పవర్ సర్వే) నివేదిక ప్రకారం రాబోయే మూడు దశాబ్దాల పాటు థర్మల్ విద్యుత్‌కు భారీ డిమాండ్ ఉంటుంది. 1.5.2024 న %వీశీఎ% కార్యదర్శి రాసిన లేఖ ద్వారా గనులకు దగ్గరగా కొత్త థర్మల్ విద్యుత్ ప్లాంట్లను స్థాపించాల్సిన అవసరం ఉంది. రవాణా ఖర్చును తగ్గించడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి అంశాల నేపథ్యంలో గని నుంచి విద్యుత్తు ఉత్పత్తి లాభదాయకంగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. సింగరేణి అధికారుల బృందం, ఒడిస్సా అధికారుల బృందంతో జరిగిన చర్చలు రెండు రాష్ట్రాలకు చాలా ప్రయోజనకరమైనవి, ఇవి ఉపాధి అవకాశాలను సృష్టించడంతోపాటు సానుకూల మౌలిక సదుపాయాల అభివృద్ధిని అందిస్తాయని లేఖలో ప్రస్తావించారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని నైని బొగ్గు గని సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టును స్థాపించడానికి తగిన భూమిని కేటాయించేందుకు, ఏర్పాట్లు చేసేందుకుకు సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరుతున్నట్టు డిప్యూటీ సీఎం తన లేఖలో పేర్కొన్నారు.

## సాంస్కృతిక పునరుజ్జీవనానికి వీపీ ధంఖర్ పిలుపు



న్యూ ఢిల్లీ, జనవరి 20 (తీన్మార్ న్యూస్): వైస్ ప్రెసిడెంట్ జగ్‌దీప్ ధన్‌ఖర్ దేశంలో దాని గొప్ప వారసత్వం మరియు సాంప్రదాయ భాషలతో తిరిగి కనెక్ట్ చేయడం ద్వారా దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం ఆవశ్యకతను నొక్కి చెప్పారు. సోమవారం న్యూఢిల్లీలోని భవన్‌లోని నంద్‌లాల్ నువాల్ సెంటర్ ఆఫ్ ఇండాలజీ శంకుస్థాపన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, భారతదేశం ఎల్లప్పుడూ శాంతి మరియు సామరస్యం కోసం కృషి చేస్తుందని పునరుద్ఘాటిస్తూ, భారతీయ జ్ఞానం మరియు దాని ప్రపంచ దృక్పథం యొక్క పరస్పర అనుసంధానాన్ని హైలైట్ చేశారు. దేశంలోని ప్రాచీన భాషలు మరియు సాహిత్యాన్ని పరిరక్షించవలసిన ప్రాముఖ్యతను శ్రీ ధంఖర్ నొక్కిచెప్పారు. దేశ సంస్కృతి మరియు వారసత్వం పట్ల యువత గర్వపడాలని, వలసవాద కథనాలపై ఆధారపడకుండా స్వదేశీ దృక్పథంతో చరిత్రను చూడాలని కోరారు. దేశ సంప్రదాయాలను అశాస్త్రీయమని తరచుగా కొట్టిపారేసిన వలసవాద శక్తులు భారతదేశ చరిత్రను తప్పుగా చూపించడం పట్ల ఉపరాష్ట్రపతి వేదన వ్యక్తం చేశారు. అతను నిజమైన డీకోలనైజేషన్ కోసం పిలుపునిచ్చారు, భారతీయులు తమ కథనాన్ని తిరిగి పొందాలని కోరారు. ఈ సెంటర్ ఆఫ్ ఇండాలజీ భారతీయ సంస్కృతిని పరిరక్షించడంలో మరియు పరిపాలన మరియు ప్రాచీన పాలనా సూత్రాల గురించి పౌరులలో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

## ఈనెల 25న ఘనంగా ఓటర్ల దినోత్సవం

మొదటి పేజీ తరువాయి

సహకరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి కోరారు. ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరైతారని ప్రకటించారు. సోమవారం బీఆర్కే భవన్‌లోని తన కార్యాలయంలో తెలంగాణలో జరగబోయే ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కీలక అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 తుది ప్రచురణ ఈనెల 6 న జరిగిందని, ఓటరు నమోదు ప్రస్తుత పరిస్థితి, రాష్ట్ర ఓటర్ల జాబితాలలో మార్పులు, చేర్పులు నిర్ధారించడానికి చేపట్టిన కార్యక్రమాలు, ప్రక్రియను పారదర్శకంగా ఉండేలా పార్టీలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈసమావేశానికి బిజెపి, మజ్లిస్, ఆమ్ ఆద్మీ పార్టీ , కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎం) నాయకులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి ఊరట

న్యూ ఢిల్లీ, జనవరి 20 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఎన్నికల ర్యాలీలో కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాపై రాహుల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ గతంలో దాఖలైన పరువునష్టం కేసులో ట్రయిల్ కోర్టు విచాచరణపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. రాహుల్ గాంధీ 2019లో జారాండ్‌లోని చైబాస నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ అమిత్‌షా మర్డరర్ గా పేర్కొన్నారని ఆరోపిస్తూ బీజేపీ కార్యకర్త నవీన్ ఝా ఈ పరువునష్టం కేసు వేశారు. రాహుల్ వ్యాఖ్యలు అమిత్‌షా గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. తొలుత ట్రయిల్ కోర్టులో దీనిపై విచారణ జరుగగా, దానిని కొట్టివేయాలని జారా□ండ్ హైకోర్టును రాహుల్ కోరారు. అయితే ఆయన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చడంతో దానిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును రాహుల్ ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన సుప్రీం ధర్మాసనం ట్రయిల్ కోర్ట్ విచారణపై స్టే విధించింది. రాహుల్ అప్పీల్‌పై సమాధానం తెలియజేయాలని జారా□ండ్ ప్రభుత్వానికి, నవీన్ ఝాకు ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. రాహుల్ తరఫున సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. బాధిత వ్యక్తి మాత్రమే పరువునష్టం కేసు వేయాలని, ప్రాక్సీ పార్టీ ద్వారా ఫిర్యాదు చేయలేమని గతంలో న్యాయస్థానాలు అనేక తీర్పులు ఇచ్చాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

## గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ 2024 ప్రకటించిన సర్కార్

హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్-2024 ను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను విడుదల చేసింది. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో ఉత్తమ సేవలందిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను అందజేస్తారు. ఇక ఎంపికైన వారికి ఈ నెల 26న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అవార్డులను ప్రదానం చేయనున్నారు. అవార్డు కింద రూ.2 లక్షలు నగదు, జ్ఞాపికను ఇవ్వనున్నారు.

### అవార్డులకు ఎంపికై వారి వివరాలు

**దుశర్ల సత్యనారాయణ**
**అరికపూడి రఘు**
**పారా ఒలింపిక్ విజేత జీవాంజి దీప్తి**
**ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు,**
**పి.బి.కృష్ణభారతికి సంయుక్తంగా ఎంపిక**
**ధ్రువాంశు ఆర్గనైజేషన్**
**ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి**
**ఆదిత్య మోహతా ఫౌండేషన్**
**సంస్కృతి ఫౌండేషన్**



# పిల్లలలో సాధారణ శీతాకాల వ్యాధులు

### అధిక తీవ్రత అనారోగ్యం




**తీన్మార్ న్యూస్ హెల్త్ అప్డేట్: చలికాలం పిల్లలను ప్రభావితం చేసే అనేక వ్యాధుల పిల్లలను, వారి తల్లిదండ్రులను అయాందోలనలకు గురించేస్తూ ఉంటాయి. కొన్ని కొన్ని వాతావరణ, పరిసరాల ప్రభావం చేతకూడా సంక్రమించవచ్చు. అత్యంత సాధారణమైన వాటిలో కొన్ని ఇక్కడ మనం పరిశీలించవచ్చు.**

జలుబు: ఇవి చాలా తరచుగా వచ్చే శీతాకాలంలో వచ్చే జబ్బులు, వైరస్‌ల వల్ల వస్తాయి. ముక్కు కారటం, తుమ్ములు, దగ్గు, గొంతు నొప్పి మరియు కొన్నిసార్లు తేలికపాటి జ్వరం వంటి లక్షణాలు ఉంటాయి.

ఫ్లూ (ఇన్ఫ్లుఎంజా): జలుబు కంటే తీవ్రమైనది, ఫ్లూ అధిక జ్వరం, చలి, శరీర నొప్పులు, దగ్గు, గొంతు నొప్పి మరియు అలసటను కలిగిస్తుంది.

స్ట్రెప్ థ్రోట్: తీవ్రమైన గొంతు నొప్పి, జ్వరం మరియు మింగడానికి ఇబ్బంది కలిగించే బ్యాక్టీరియా సంక్రమణ.

చెవి ఇన్‌ఫెక్షన్‌లు: తరచుగా జలుబుతో కలిసి, చెవినొప్పి, చిరాకు మరియు కొన్నిసార్లు జ్వరం వస్తుంది.

బ్రోన్కియోలిటిస్: ప్రాథమికంగా శిశువులు మరియు చిన్న పిల్లలను ప్రభావితం చేస్తుంది, ఇది ఊపిరితిత్తులలోని చిన్న శ్వాసనాళాల వాపుకు కారణమవుతుంది, ఇది దగ్గు, శ్వాసలోపం మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికి దారితీస్తుంది.

క్రూప్: ఒక వైరల్ ఇన్ఫెక్షన్ మొరిగే దగ్గు, గొంతు బొంగురుపోవడం మరియు శబ్దంతో కూడిన శ్వాసను కలిగిస్తుంది, ముఖ్యంగా రాత్రి సమయంలో.

న్యుమోనియా: ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ జ్వరం, దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తుంది.

**నివారణకు చిట్కాలు**

టీకాలు వేయడం: ముఖ్యంగా ఫ్లూ, కోరింత దగ్గు మరియు న్యుమోకాకల్ వ్యాధికి సంబంధించిన టీకాలపై మీ పిల్లలు తాజాగా ఉన్నారని నిర్ధారించుకోండి.

చేతి పరిశుభ్రత: ముఖ్యంగా దగ్గు, తుమ్ములు లేదా బాత్రూమ్ ఉపయోగించిన తర్వాత సబ్బు మరియు నీటితో తరచుగా చేతులు కడుక్కోవడాన్ని ప్రోత్సహించండి.

ఆరోగ్యకరమైన అలవాట్లు: పౌష్టికాహారం, పుష్కలంగా ద్రవాలు మరియు క్రమం తప్పకుండా వ్యాయామంతో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించండి.



**డా. పీ. రమేష్** | ఎండి పిడియాట్రిక్స్ (జీఎంసీ), శిశు మరియు పిల్లల వైద్య నిపుణులు (శ్రీ సాయి హాస్పిటల్ 3 చింతల్, నయింనగర్, హన్మకొండ)

**సన్నిహిత సంబంధాన్ని నివారించండి:**

సాధ్యమైనప్పుడు, అనారోగ్యంతో ఉన్న వ్యక్తులతో సంబంధాన్ని తగ్గించండి. శిశువైద్యుని సంప్రదించండి.

**అధిక తీవ్రత అనారోగ్యం.. శిశువైద్యుని సంప్రదింపు**

- ఓవర్ ది కౌంటర్ మందులకు స్పందించని అధిక జ్వరం ఉండడం.
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా వేగంగా శ్వాస తీసుకోవడం.
- మెరుగుపడని తీవ్రమైన దగ్గు.
- డీహైడ్రేషన్ (మూత్ర విసర్జన తగ్గడం, నోరు పొడిబారడం, నీరసం).
- చెవి నొప్పి లేదా అసౌకర్యం సంకేతాలు.
- దద్దుర్లు లేదా ఇతర సంబంధిత లక్షణాలు.

## రైతు ఆత్మహత్యలు, పరిస్థితులపై అధ్యయన కమిటీ

తెలంగాణ బ్యూరో, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 9 మందితో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా ప్రకటించారు. మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో 9 మంది సభ్యులు గల ఈ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రికి, వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కి నివేదికను అందజేస్తుందని కేటీఆర్ తెలిపారు. రెండు వారాల పాటు విస్తృతంగా పర్యటించిన అనంతరం, రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలకు దారి తీస్తున్న ప్రధాన కారణాలతో పాటు గత ఏడాది వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి నివేదికను రూపుదిద్దుతుందని కేటీఆర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సన్న, చిన్న, కౌలు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు. రైతన్నలను, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా దిక్కులు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశా నిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలన్న ఉద్దేశంతో ఈ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఏడాది



పాలనలో రైతు ఆత్మహత్యలు విపరీతంగా పెరిగాయని, ఇప్పటికే 400కు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. విస్తృత అధ్యయనం అనంతరం, పార్టీ తరఫున రూపొందించే నివేదికను ప్రభుత్వానికి అందజేసి, రానున్న బడ్జెట్ సమావేశాల్లో రైతు సమస్యలపై, వారికి ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

**కమిటీ సభ్యులు:**

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిటీలో, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ సభ్యులుగా ఉన్నారు.

## ప్రపంచ ఆర్థిక సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు

న్యూ ఢిల్లీ, జనవరి 20 (తీన్మార్ న్యూస్): స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు హాజరయ్యారు. మంత్రులతో కలిసి దావోస్ పర్యటనకు వెళ్లిన సమయంలో అరుదైన కలయిక జరిగింది. జ్యూరిచ్ చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం అదే ఎయిర్ పోర్టులో అప్పటికే అక్కడ ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. సీఎం చంద్రబాబు. సోమవారం ఉదయం జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో వీళ్ల మీటింగ్ జరిగింది. తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులపై లక్ష్యంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారుల బృందం దావోస్ లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైంది.



తీన్మార్
తెలుగు దినపత్రిక

## 'దేశానికి' వారసులెవరు?

ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడపలో జరిగిన ఒక ప్రోగ్రాంలో పాల్గొన్నారు. అక్కడ వేదిక మీద పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి చంద్రబాబుకు ఆహ్వానం పలుకుతూ తెలుగుదేశం పార్టీ 43 సంవత్సరాల ప్రస్థానంలో మూడవ తరం నాయకుడిగా లోకేష్ ను అభివర్ణించారు. తెలుగుదేశం పార్టీ మూడోతరం నాయకుడైన లోకేష్ సమర్థతను కొనియాడుతూ ఆయనను ఉప ముఖ్యమంత్రి పదవికి ప్రమోట్ చేయాలని చెప్పి చంద్రబాబు నాయుడును కోరారు. ఇది పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పుర్రెలో పుట్టిన బుద్ధా లేకపోతే పథకం ప్రకారమే ఆయన చేత అలా చెప్పించారా అనే విషయమై ఇవాళ ఆంధ్రప్రదేశ్ అంతటా చర్చ జరుగుతున్నది. మరోవైపు పవన్ కళ్యాణ్ వ్యవహార శైలి చంద్రబాబు నాయుడుకు మింగుడు పడని విధంగా తయారైంది. ఇటీవల కాలంలో అక్కడ జరిగిన సంఘటనలు మనం చూసినట్లయితే పవన్ కళ్యాణ్ మరి తను స్వయంగా అలా వ్యవహరిస్తున్నాడా లేక పైనుంచి ఎవరైనా అలా ఉండమని ఆయనను ఉసిగొలుపుతున్నారా తెలియదుగానీ కొద్దికాలం క్రితం హెూం మంత్రి అనితను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు గాని, ఆ తర్వాత బియ్యం అక్రమంగా తరలిపోతోందంటూ 'సీజ్ ది షిప్' అని చేసిన నినాదం గాని, నిన్నగాక మొన్న తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయిన సంఘటన అనంతరం తిరుపతిలో పర్యటించి ఆయన చేసిన హడావుడి గాని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రుచించే విషయాలేమీ కాదు.

ఎన్టీఆర్ వంశంలోని వారసులు అంటే బాలకృష్ణ, ఆయన కుమారుడు మోక్షజ్ఞ కావాలి. బాలకృష్ణ రాజకీయాల్లోనే క్రియాశీలంగా ఉన్నాడు. ఆయన హిందూపురం శాసనసభ్యుడు, పార్టీ పాలిట్ బ్యూరో సభ్యుడు కూడా. లేదా దివంగత నాయకుడు ఎన్ టీ రామారావు చైతన్యరథ సారథి హరికృష్ణ అయినా కావాలి. ఆయన కుమారులు జూనియర్ ఎన్టీఆర్ లేదా కళ్యాణ్ రామ్ కావాలి. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మరణించి నిన్నటికి 29 సంవత్సరాలు. 1996 జనవరి 18న ఎన్టీ రామారావు అధ్యక్షుడిగా ఉన్న తెలుగుదేశం పార్టీ బ్యాంక్ అకౌంట్లను తిరుగుబాటు నాయకుడు చంద్రబాబు నాయుడు అభ్యర్థన మేరకు కోర్టు స్తంభింపజేయడంతో ఆవేదనకు గురై ఆ రాత్రి ఎన్టి రామారావు గుండెపోటుతో మరణించారు. ఎన్టీ రామారావు మాకు అక్కరలేదు, ఆయనతో పనే లేదు అని అధికారం నుంచి దించేసిన తర్వాత బహిరంగంగానే ప్రకటనలు చేసిన చంద్రబాబు నాయుడు.. ఎన్టీఆర్ మరణానంతరం ఆయనకు తానే నిజమయిన వారసుడినని నిరూపించుకునేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ వదిలిపెట్టడం లేదు. నిత్యం ఆయన జపం చెయ్యకుండా గడిచిందే లేదు. ఈ విషయాలు ఎందుకు జ్ఞాపకం వస్తున్నాయంటే శనివారంనాడు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడపలో జరిగిన ఒక ప్రోగ్రాంలో పాల్గొన్నారు. అక్కడ వేదిక మీద పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి చంద్రబాబుకు ఆహ్వానం పలుకుతూ తెలుగుదేశం పార్టీ 43 సంవత్సరాల ప్రస్థానంలో మూడవ తరం నాయకుడిగా లోకేష్‌ను అభివర్ణించారు. తెలుగుదేశం పార్టీ మూడోతరం నాయకుడైన లోకేష్ సమర్థతను కొనియాడుతూ ఆయనను ఉప ముఖ్యమంత్రి పదవికి ప్రమోట్ చేయాలని చెప్పి చంద్రబాబు నాయుడును కోరారు. ఇది పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి పుర్రెలో పుట్టిన బుద్ధా లేకపోతే పథకం ప్రకారమే ఆయన చేత అలా చెప్పించారా అనే విషయమై ఇవాళ ఆంధ్రప్రదేశ్ అంతటా చర్చ జరుగుతున్నది. ఉప ముఖ్యమంత్రి ఏం ఖర్మ.. చంద్రబాబు నాయుడు తన ఐదేళ్ల పదవీ కాలం పూర్తయ్యేలోగా లోకేష్‌ను ముఖ్యమంత్రిగానే ప్రకటిస్తారనే ప్రచారం కూడా జరిగింది గతంలో. కానీ కూటమిగా ఏర్పడి అధికారంలోకి వచ్చిన కారణంగా వయసురీత్యా తాను తప్పుకుని వారసుడిగా లోకేష్‌ను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టాలని చంద్రబాబు స్వతహాగా అనుకున్నా, వత్తిడికి లొంగి ఆ పని చెయ్యాలనుకున్నా సాధ్యం కాని పరిస్థితి. ఇంకో పక్క ఈ ప్రమాదాన్ని పసిగట్టినందువల్లనేమో పవన్ కళ్యాణ్ పదేపదే చంద్రబాబు నాయుడు సమర్థుడయిన నాయకుడనీ ఇంకో పదిహేనేళ్ళపాటు ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారనీ ప్రకటిస్తూ ఉంటారు. ఇక లోకేష్‌ను ముఖ్యమంత్రిని చెయ్యడం కూటమి ప్రభుత్వంలో సాధ్యపడదు కాబట్టి ఉపముఖ్యమంత్రిగానైనా ప్రమోట్ చేయించుకోవాలనే ఆలోచన ఉన్నట్టు అర్థం అవుతున్నది. మంత్రివర్గంలో ఎవరిని చేర్చుకోవాలి, ఏ హెూదా ఇవ్వాలి అన్నది పూర్తిగా ముఖ్యమంత్రి నిర్ణయం కాబట్టి దాని గురించి ఎవరూ ఏమీ ప్రశ్నించడానికి వీల్లేదు. ఇక్కడ తెలుగుదేశం పార్టీ మూడు తరాల గురించి కొంచెం మాట్లాడుకోవాలి. లోకేష్ బాబు మూడవ తరం నాయకుడని అంటే ఎన్టీ రామారావు మొదటి తరం, చంద్రబాబు రెండవ తరం, లోకేష్ బాబు మూడో తరం అని అర్థం చేసుకోవాలి. చంద్రబాబు నాయుడు అయినా, లోకేష్ నాయుడు అయినా ఎన్.టి. రామారావు వారసులు ఎలా అవుతారు? రాజకీయ వారసత్వానికి కన్నబిడ్డలే కావలసిన అవసరం లేదనే వాదన చంద్రబాబు నాయుడు గానీ, లోకేష్ నాయుడు గాని, వాళ్ళని సమర్థిస్తున్న వారు గానీ చేయవచ్చు. కానీ ఎన్టీఆర్ వర్ధంతి వేళ ఆయన మరణించడానికి కొద్ది రోజుల ముందు చంద్రబాబు నాయుడు గురించి తన అభిప్రాయాన్ని వీడియోలో రికార్డు చేసిన విషయాలు గుర్తు చేసుకోవాలి. ఎన్టీఆర్ వంశంలోని వారసులు అంటే బాలకృష్ణ, ఆయన కుమారుడు మోక్షజ్ఞ కావాలి. బాలకృష్ణ రాజకీయాల్లోనే క్రియాశీలంగా ఉన్నాడు.

## పేదలకు ఇళ్ల స్థలాలు అప్పగించాలి

**– సమస్య పై రెవెన్యూ అధికారులు స్పందించాలి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం**

**– బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ జెడ్పీ చైర్మన్ బడే.నాగ జ్యోతి**



ములుగు, జనవరి 20 (తీన్మార్ న్యూస్): కాటాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు వెంటనే ఇంటి స్థలాలను కేటాయించాలని ములుగు మాజీ జడ్పీ చైర్ పర్సన్, బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజక వర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. ఈ సమస్య పై కాటా పురం గ్రామానికి చెందిన ఇండ్ల లబ్ధిదారులతో కలిసి ఆమె జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ తాడ్వాయి మండలంలోని కాటాపురం గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు 2023లో ఇళ్ల స్థలాలను అప్పటి ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. సర్వే నంబర్ 147 లో 108 మంది నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 75 గజాల చొప్పున ఇంటి స్థలాలను మంజూరు చేశారన్నారు. ఇంటి స్థలాలను అర్హులైన లబ్ధిదారులకు అప్పగించే సమయంలో ఎన్నికలు రావడంతో ఇళ్ల స్థలాలను వారికి అప్పగించడంలో జాప్యం జరిగిందన్నారు. ఇప్పటికి మండల రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో నేటికీ లబ్ధిదారులు ఇళ్ల స్థలాలను అందుకోలేక పోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి లబ్ధిదారులకు వెంటనే ఇళ్ల స్థలాలను అప్పగించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ 15 రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద నాయక్, మాజీ జడ్పిటిసి సభ్యులు రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు పులి నర్సయ్య, పుల్లూరి గౌరమ్మ ,మాజీ ఎంపీటీసీ దానక నర్సింగరావు,పిఏసీఎస్ చైర్మన్ ఇందా రపు లాలయ్య, సయ్యద్ హుస్సేన్,సాయిరి లక్ష్మీనర్సయ్య, లంజపెల్లి రాంబాబు పుల్లూరి రమతో పాటు 50 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తిచేయాలి



**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): మరిపెడ మునిసిపాలిటీ కేంద్రంలోని పలు వార్డులు, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలలోని అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ మరిపెడ మునిసిపల్ కేంద్రంలో పర్యటించి మునిసిపల్ కేంద్రంలో వివిధ వార్డులలో చేపట్టే వివిధ సివిల్ పనులకు సంబందించి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అందుకు ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు, అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చూడాలని అన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలలోని కిచెన్, డైనింగ్ హాలును పరిశీలించి పనులను త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులతో అన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లను చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను పట్టణంలోని స్థానిక ఎన్.టి.ఆర్ స్టేడియంలో నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి లతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలు జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతీయ పతాకావిష్కరణ పోలీసు వందనం పరేడ్ కార్యక్రమాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పారిశుధ్యం నిర్వహణ మున్సిపల్ కమిషనర్ కు సూచిస్తూ వేదికను పుష్పాలంకరణ చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. ముఖ్య అతిథులకు ఆహ్వాన పత్రాలు అందించడం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమాలను రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసే ఆహ్వానితులకు స్వాగతం పలుకుతూ సభ నిర్వహణను చేపట్టాలని ఆర్డిఓ మహబూబాబాద్ కు తెలిపారు. జిల్లా ప్రగతి పై రూపొందించే కాపీ ఏర్పాట్లను సిపిఓ, డిపిఆర్ఓ చూడాలన్నారు. ప్రెస్ గ్యాలరీ ఏర్పాటు చేయాలని తాసిల్దార్ కు సూచించారు. జాతీయ భావం ఉట్టిపడేలా సాంస్కృతి కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని పలు శాఖ అధికారులకు సూచించారు. అగ్నిమాపక యంత్రాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని ఫైర్ శాఖ అధికారిని ఆదేశించారు. అదేవిధంగా 108 వాహనాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారికి తెలియజేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారికి సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సి.ఈ.ఓ పురుషోత్తం, మహబూబాబాద్ ఆర్.డి.ఓ కృష్ణ వేణి, డి.ఎస్పీ తిరుపతి రావు, సి.పి.ఓ సుబ్బారావు, డి.ఎం.అండ్ హెచ్.ఓ డాక్టర్ మురళీధర్, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, డి.ఎస్.ఓ ప్రేమ్ కుమార్, మైనింగ్ అధికారి వెంకటరమణ, ఆర్.అండ్.బి ఈ.ఈ భీమ్లు, సివిల్ సప్లై అధికారి కృష్ణ వేణి, డి.ఈ.ఓ డాక్టర్ రవీందర్ రెడ్డి,ఇంచార్జ్ డి.పి.ఆర్.ఓ. వర్లోజు శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ రవీందర్ యాదవ్, ఫైర్ సేఫ్టీ అధికారి నాగేశ్వరరావు, డి.వై. ఎస్.ఓ జ్యోతి, జి.సి.జి.డి.ఓ విజయకుమారి, మహబూబాబాద్ తహశీల్దార్ భగవాన్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ మదన్ గోపాల్, సి –సెక్షన్ సూపరింటెండెంట్ బాలకిషన్, సీనియర్ అసిస్టెంట్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతివారికి రేషన్ కార్డు అందిస్తాం..



**– బీఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలు ప్రజలు నమ్మొద్దు..**

**– బర్రె జహంగీర్ మున్సిపల్ మాజీ చైర్మన్ (బిజెఆర్ )..**

భువనగిరి: అర్హులకు రేషన్ కార్డుల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ తెలిపారు. సోమవారం ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు దరఖాస్తుల సర్వేలో భాగంగా షియా కాలనీలో సర్వే ను, వివిధ వార్డులలో జరుగుతున్న సర్వేను ప్రజలకు వివరించారు. 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఒక ఇల్లు, ఇంటి రుణం, రేషన్ కార్డులు ఇవ్వలేని నాటి ప్రభుత్వం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు ఈ నెల నుండి అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా ఇవ్వడం జరుగుతుందన్నారు. జాబితాలో ఏదైనా సాంకేతిక ఇబ్బందులతో రానటువంటి వారు ఎవరు కూడా అధైర్య పడకుండా సమయానికి దరఖాస్తు చేసుకొని వారు రేపటినుండి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే వార్డు సమావేశాల్లో కొత్త వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే కొత్త రేషన్ కార్డులు అందించనున్నట్టుగా చెప్పారు. ఆయన వెంట ఉడత రమేష్, ఎండి ఇఫ్తాకర్, బోయిని ధనలక్ష్మి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## శారీరక శ్రమ చేయడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది

**ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్**



మహబూబాబాద్ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): శారీరక శ్రమ చేయడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్ అన్నారు. సోమవారం నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో 18 మరియు 20వ తేదీలలో మహబూబాబాద్ పట్టణంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహబూబాద్ క్రీడ ప్రాంగణంలో నిర్వహించిన బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్ గెలుపొందిన యువతకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బి మురళి నాయక్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన దైనందిక జీవితంలో ఆటలాడడం అలవర్చుకోవాలని అప్పుడు మాత్రమే శారీరకంగా దృఢంగా వ్యక్తులు తయారవుతారని శారీరక శ్రమ చేయకుంటే ఆరోగ్యం అనేక అనారోగ్యాలకు దారి తీయడానికి అవకాశం ఉంటుందని కావున ప్రతి దైనందిన జీవితంలో కొన్ని గంటలు ఆటలకు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర మరియు చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షులు అచ్చ సుజిత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




**– ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులచే ర్యాలి..**

**– ఎస్సై రామ్మోహన్**

తంగళ్ళపల్లి: ట్రాఫిక్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తంగళ్ళపల్లి ఎస్సై రామ్మోహన్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. గతంలో కూడా మైనర్ల వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరిగింది అన్నారు. ట్రాఫిక్ అవగాహన లోపం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.
వాహనదారుడు మద్య సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో నిరంతరం వాహనాల తనిఖీ జరుగుతుందన్నారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన పత్రాలను, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర పత్రాలను కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా తమ ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు.

## ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించాలి

**– అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలను ఖచ్చితంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం పలిమేల మండలంలో రేషన్ కార్డులు, రైతు భరోసా, గ్రామసభలు నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆందోళన చెందొద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26 నుండి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు పై ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామ సభలను షెడ్యూల్ వారీగా ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యాని తావు లేకుండా అధికారులందరూ అత్యంత జాగ్రత్తగాబాధ్యతగా గ్రామసభలు సజావుగా నిర్వహించాలని సూచించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. గ్రామ సభలలో ఫ్లెక్సీ లు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో అర్హుల జాబితాను ప్రచురించాలని, గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులు రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరించాలని, గ్రామ సభలలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, గ్రామ సభలకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో లబ్ధిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలని, అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఎలాంటి అపోహలు తలెత్తకుండా ప్రజలకు స్పష్టంగా వివరించాలని, ఈ మొత్తం సంక్షేమ పథకాల రోజు వారీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సభల తీర్మాన ప్రతులను సురక్షితంగా, ఎంతో జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాద్, తహసీల్దార్ అనిల్, వ్యవసాయ, పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత గృహ కుట్టు యంత్రాలకు దరఖాస్తు తేది పొడగింపు

**- మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి బి. శ్రీనివాస రావు**

మహబూబాబాద్ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని పేద, నిరుద్యోగ, అర్హత మరియు శిక్షణ పొందిన క్రిస్టియన్ మైనారిటీ మహిళలకు "ఇందిరమ్మ మహిళా శక్తి'' పథకం కింద ఉచిత గృహ కుట్టు యంత్రాలను అందజేయనున్నదని అందుకోసం క్రిస్టియన్ మైనారిటీ మహిళా దరఖాస్తుదారు తమ దరఖాస్తు ఫారమ్ ను తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వెబ్ పోర్టల్ tgobmms.cgg.gov.in ద్వారా తేది 25-01-2025 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని బి. శ్రీనివాస రావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హత ప్రమాణాలు:

1. క్రిస్టియన్ మైనారిటీ కమ్యూనిటీకి చెందిన నిరుద్యోగ మహిళలుబీ నిరుపేదలు, విడాకులు, వితంతువులు, అనాథలు మరియు ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.
2. బాప్తిసం / BC-C సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
3. తెల్ల రేషన్ కార్డ్ / ఆహార భద్రత కార్డు లేదా రెండూ అందుబాటులో లేకుంటే, ఆదాయ ధృవీకరణ పత్రం మాత్రమే అందించాలి, అభ్యర్థి యొక్క తల్లిదండ్రుల / సంరక్షకుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షల కంటే తక్కువ మరియు పట్టణ ప్రాంతాల్లో రూ. 2.00 లక్షల వరకు ఉండాలి.
4. దరఖాస్తుదారు యొక్క వయోపరిమితి 21 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి (వయస్సు రుజువుగా ఓటర్ ID/ఆధార్ కార్డ్) తప్పనిసరి
5. నివాస రుజువుగా ఆధార్ కార్డ్ తప్పనిసరి.
6. ఒక కుటుంబానికి/ఇంటికి ఒక కుట్టు యంత్రం ఇవ్వబడుతుంది.
7. TSCMFC ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణా సంస్థలలో శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.
8. శిక్షణా ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి (ఐచ్ఛికం).
9. కనీస విద్యార్హత - 5వ తరగతి.
10. దరఖాస్తుదారు గత 5 సంవత్సరాలలో TGCMFC నుండి ఆర్థిక సహాయం పొందలేదని స్వీయ-ప్రకటన ఇవ్వాలి. వివరములకు 9182540680, 9573769507 ను కార్యాలయ సమయములో సంప్రదించగలరని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# నేటి నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణ



- గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు
- 21 నుండి గ్రామ సభల్లోనూ దరఖాస్తు తీసుకుంటాం
- లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ
- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- జనవరి 26 నుంచి నాలుగు నూతన పథకాల అమలు
- జిల్లా ప్రజలు ఎలాంటి అపోహలను నమ్మొద్దు
- గ్రామ సభలకు జిల్లా ప్రజలు సహకరించాలి
- కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్

ములుగు జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): నేటి నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగినదని, దరఖాస్తు తీసుకుంటామని, లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని, జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులం దరికి ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు చేరేలా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నట్లు, అందుకు గాను ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్ర స్థాయి దరఖాస్తులు పరిశీలన చేయడం జరిగిందని, 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందనీ జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి ప్రారంభించనుందని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పంట వేసినా, వేయక పోయినా అందుతుందని, రైతులు అనవసర అపోహలు పెట్టుకోవద్దని, రైతు భరోసా పథకానికి ఎటువంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు 12 వేలు పెట్టుబడి సహాయం ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12 వేలు రూపాయలను అందించనున్నట్లు, ఒక్కో విడతకు 6 వేల చొప్పున రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనుందని, 2023-24 సంవత్సరానికి ఉపాధి హామీ క్రింద పని చేసిన భూమి లేని రైతు కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. జిల్లాలో 20 రోజులు ఉపాధి హామీ కూలీలు గా పని చేసిన కార్మికుల జాబితాను తీసుకొని ఆధార్ కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమిలేని కుటుంబాలను ఎంపిక చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ద్వారా సొంత భూమి ఉండి ఇండ్లు లేని కుటుంబాల జాబితాను సిద్ధం చేశామని, గ్రామ సభలో అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుం దని, గ్రామ సభలో అర్హుల జాబితా గ్రామాల వారీగా సిద్ధం చేసిన తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సభల్లో ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. కుటుంబం లో విభజన అయినవారు కొత్త కార్డు కావాలని తీసుకున్న దరఖాస్తును కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని అన్నారు. ఇదివరకు ఎప్పుడూ దరఖాస్తు సమర్పించకపోయినా గ్రామాల్లోకి వచ్చే అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల ప్రభుత్వ సంక్షేమ పథకాల పై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎం పి డి ఓ లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని లేదా కలెక్టరేట్లోనీ కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 425 7109 ను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు

**- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి**



దేవరకద్ర ప్రతినిధి,జనవరి20(తీన్మార్ న్యూస్) :వనపర్తి జిల్లా మదనాపురం మండలం శంకరమ్మ పేట, ద్వారక నగర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి.అంతకుముందు, మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తామని, రేషన్కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అన్నారు. ఇందులో ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.ఈ నెల21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలలో ఇందిరమ్మ ఇండ్లకు, రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన,ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 26 రిపబ్లిక్ డే నుండి 12వేలు రూపాయలు రైతు భరోసా వేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ సమగ్ర మాస్టర్ ప్లాన్ కోసం డ్రోన్ సర్వే ప్రారంభం

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




జనగామ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): జనగామకు కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించనుండగా, ఇందుకు సంబంధించిన డ్రోన్ ఏరియల్ సర్వే కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో గల మినీ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 పథకంలో భాగంగా నూతన మాస్టర్ ప్లాన్ల తయారీ కోసం జనగామ మున్సిపాలిటీని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని నివాస, వాణిజ్య, వ్యవసాయ భూముల గుర్తింపు, అభివృద్ధి, ఇతర అంశాల పరిశీలన కోసం డ్రోన్ ఏరియల్ సర్వేను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పట్టణానికి సంబంధించిన సమగ్ర మాస్టర్ ప్లాన్ను రూపొందిం చేందుకు గాను డ్రోన్ కెమెరాలతో పాటు అధునాతన సాంకేతికతతో వివిధ విభాగాల నుంచి సమాచారాన్ని సేకరిస్తుందని, స్పష్టమైన దృశ్యమాధ్యమ డాక్యు మెంటేషన్ తో బేస్ మ్యాప్లను రూపొందించవచ్చని, ఈ ఖచ్చితమైన మ్యాపింగ్ తో భవనాలు, రోడ్లు, నీటి వనరులు, ఉద్యాన వనాలు, మురుగు కాలువల వ్యవస్థలను కనుగొనడంలో, సమగ్ర ప్రణాళిక ద్వారా నిర్వహణ,అభివృద్ధిని సులభతరం చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ జమున,కమిషనర్ వెంకటేశ్వర్లు,ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): ఈ నెల 21వ తేది నుండి నిర్వహించనున్న గ్రామసభలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి గ్రామ పంచాయతీల్లో 21వ తేదీ మంగళవారం జరుగనున్న గ్రామసభల ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహణ సమాచారం ప్రజలకు తెలిసేలా టామ్ టామ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు చేయనున్న సందర్భంగా ఈ నెల 16వ తేదీ నుండి 20 వ తేదీ వరకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో వ్యవసాయ యోగ్యమైన, వ్యవసాయం చేయని భూముల సమగ్ర సమాచారం సేకరణ చేసారని తెలిపారు. అట్టి జాబితాను గ్రామసభల్లో లబ్ధిదారుల జాభితా చదివి వినిపినించి తుది జాభితా తయారు చేయనున్నట్లు తెలిపారు. నూతన రేషన్ కార్డులకు గ్రామ సభలలో దరఖాస్తుల స్వీకరించాలని తెలిపారు. రేషన్ కార్డులు జారీ అనేది నిరంతర ప్రక్రియని ఆయన పేర్కొన్నారు. రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రభుత్వం ఈ నెల 26 న శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. రైతు భరోసా, నూతన రేషక్ కార్డులు జారీకి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు క్షేత్రస్థాయి విచారణ చేశారన్నారు. అట్టి జాభితాను గ్రామ సభలలో ఫైనల్ చేయనున్నామని తెలిపారు. ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామసభలకు విస్తృతమెన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామ సభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు త్రాగునీరు, నీడ వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ లు జారీ చేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియ అని చివరి లబ్ధిదారుల వరకు అందించడం జరుగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ నెల 21 నుంచి 24 వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో మండల, గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారు లు పాల్గొనాలని సూచించారు. విధులు నికేటాయించి న సిబ్బంది, అధికారులు తప్పని సరిగా గ్రామసభల్లో పాల్గొనాలని ఎలాంటి. మినహాయింపు లేదని ఆయన స్పష్టంగా చేశారు. అత్యవసర పరిస్థితిలో తన అనుమతి తీసుకోవాలని, గ్రామ సభలకు గైర్హాజరైతే తగు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. గ్రామసభలు నిర్వహణలో పక్కాగా మినిట్స్ నమోదు చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులు రిజిష్టర్ లో నమోదు చేయాలన్నారు. అంతకు ముందు రాఘవవరెడ్డిపేటలో వంగా మల్లయ్య ఇంటి వద్ద జరుగుతున్న విచారణ ప్రక్రియను తనిఖీ చేశారు. నమోదులు పరిశీలించి, వంగా మల్లయ్య ఇచ్చిన సమాచారం వాస్తవమా కాదా మల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శైలజ, తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, వ్యవసాయ అధికారి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రత్యేక ప్రణాళిక అమలు

- పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తాం
- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క





ములుగు జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, మహిళా సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో ఎదగడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్ సంపత్ రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ మహిళా క్యాంటీలను ఏర్పాటు చేస్తున్నామని, మహిళలు అన్ని రంగాలలో ఎదగడానికి ప్రత్యేక చొరువ తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంలో భాగంగా కార్పొరేట్ కంపెనీల సహాయంతో 8 గ్రామాలను దత్తత తీసుకొని రెండున్నర కోట్ల రూపాయలతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని, జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని జిల్లాలోని అన్ని గ్రామాలలో రోడ్డు డ్రైనేజీ పనులను చేపట్టి సంవత్సర కాలంలో పూర్తి చేస్తామని అన్నారు. జిల్లా ప్రజలు అనేక సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నిర్మాణ పనులు ఐదు కోట్ల 11 లక్షల రూపాయలతో హైటెక్ తరహాలో నిర్మించడంతో పాటు ఏటూర్ నాగారంలో బస్ డిపో ఏర్పాటు కోసం ఏడు కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. అభివృద్ధి పనులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ నాణ్యత తొ పూర్తి చేయాలని సూచించారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ములుగు జిల్లాలో పర్యాటక ప్రాంతం అభివృద్ధి చెందుతున్నదని యోనిస్కో గుర్తింపు పొందిన రామప్ప తో పాటు లక్నవరం, సమ్మక్క సారలమ్మ జాతర, బొగత జలపాతం పర్యాటకులను ఆకట్టుకునే విధంగా దట్టమైన అటవీ ప్రాంతంలో బ్లాక్ బెర్రీని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. జిల్లాలోని నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందడానికి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించ బోతున్నామని, ఈ శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూనే ప్రభుత్వ పథకాలు అర్హులకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు మంచి మనసుతో పనిచేస్తూ ప్రజలలో స్థిరస్థాయిగా నిలిచిపోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ జగదీష్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్లాల్, డిపిఓ దేవరాజ్, ఏపీడి బాలస్వామి, కిసాన్ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద**



వరంగల్ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పై జరుగుతున్న సర్వేను పకడ్బందీ గా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. రాయపర్తి మండలం గన్నారం, వర్ధన్నపేట మండలం రావోజీ తండాలో జరుగుతున్న సర్వే తీరును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం పరిశీలించారు. సర్వేలో ఎదురవుతున్న సమస్యలను సర్వే టీం లతో మాట్లాడి కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూక్య మల్లు అనే రైతు కలెక్టర్ తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేస్తూ, ఈ తండాలో అంగన్వాడి సెంటర్ ను ఏర్పాటు చేయాలని, రోడ్డు కూడా అవసరం ఉందని, వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ గ్రామసభల్లో సమస్యలపై వినతులు స్వీకరిస్తారని, ఏ సమస్యలున్నా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుటకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పై నిర్వహిస్తున్న సర్వనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేలా చూడాలని సర్వే టీంను ఆదేశించడమైనది. ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి జడ్పి సీఈఓ రాంరెడ్డి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి, వర్ధన్నపేట తహసిల్దార్ విజయ్ సాగర్,రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్,ప్రత్యేక అధికారి ఫిషరీస్ నాగమణి, సర్వే టీం సభ్యులు ఉన్నారు.

# గ్రామ సభల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్



హనుమకొండ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు సంబంధించి మంగళవారం నుండి గ్రామపంచాయతీ కార్యాలయాలలో నిర్వహించే గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుండి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్డీవోలు, నోడల్ అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలతో గ్రామసభల నిర్వహణపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభ ప్రారంభం కాగానే ప్రజాపాలన గ్రామసభలో ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాలపై గ్రామ ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించేందుకు గ్రామపంచాయతీలలో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామసభ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. గ్రామ సభలలో ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేయాలన్నారు. గ్రామసభలోనే అర్హుల జాబితాను ప్రకటించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామసభల నిర్వహణ ప్రక్రియకు సంబంధించి అధికారులకు కలెక్టర్ పలు సలహాలు, సూచనలు చేశారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26న జరుపుకొనే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిందిగా సూచించారు. గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణ లో భాగంగా ధర్మకంచ మినీ స్టేడియం, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, చెత్తాచెదారం లేకుండా పిచ్చి మొక్కలను తొలగించాలని, వివిధ శాఖల తరపున స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు గణతంత్ర దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించే కార్యక్రమాలను ఏఓ పర్యవేక్షించాలన్నారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ, డీపీఆర్ఓ సంయుక్తంగా కలిసి తయారు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమా ల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా చేసే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. ఫైర్ ఇంజన్ లను సిద్దంగా ఉంచాలని, తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ ను ఉపయోగించరాదని, స్టేజ్ అలంకరణ, పూలమొక్కల ఏర్పాటు, తివాచీలను, బ్యారికేడ్ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు, గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ వంటి ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాల న్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సమర్థవంతంగా చేపట్టిన ఉత్తమ ఐదు మండలాలను ఎంపిక చేయాలని, అలాగే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో మూడు బృందాల వారీగా ఉత్తమ మండలా లను ఎంపిక చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏవో మన్సూర్, సిపిఓ పాపయ్య, జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, ఎక్సైజ్ శాఖ పర్యవేక్షకురాలు కృష్ణవేణి, డిపిఆర్ఓ పల్లవి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానవన, హర్టికల్చర్ అధికారి శ్రీధర్ రావు, డీవైఎస్ఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్ హుస్సేన్, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



హనుమకొండ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): ఈనెల 26వ తేదీన జరుగునున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బీ, మున్సిపల్, తదితర శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు అధికారుల సమన్వయంతో ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వేడుకల ప్రారంభం నుంచి మొదలుకొని వివిధ కార్యక్రమాలు ముగిసే వరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలను తెలిపేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, స్వాతంత్ర్య సమర యోధులకు సన్మాన కార్యక్రమం, సభా ప్రాంగణంలో సరిపోను కుర్చీలను, తాగునీరు ఏర్పాటు చేయాలని, విద్యుత్ కు అంతరాయం లేకుండా చూసుకోవాలని, జనరేటర్ ను అందుబాటులో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్ఓ వై.వి. గణేష్, డిఆర్డిఓ శ్రీను, ఆర్డీవోలు రమేష్, నారాయణ, జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామసభలను విజయవతంగా నిర్వహించాలి

**- ప్రజాభిప్రాయం మేరకు, ప్రజల సమ్మతితో గ్రామసభలు**

**- గ్రామ సభలలో పథకాలు అర్హుల జాబితా ప్రదర్శించాలి**

**-చిట్టచివరి అర్హుల వరకు సంక్షేమ పథకాలు అందాలి ఇది నిరంతర ప్రక్రియ**

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26 నుంచి అందించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్ల సంక్షేమ పథకాల అమలులో భాగంగా రేపటినుండి నుండి 24 వరకు నిర్వహించు గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్,అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి జిల్లాలోని ఆర్డీవోలు,తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు మరియు సంబంధిత అధికారులతో గ్రామ సభల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి, గ్రామసభల నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టవలసిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేపటినుండి నిర్వహించు గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభల నిర్వహణ ఈ వార్డులో ఏ రోజు గ్రామ సభలో నిర్వహించేది ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. గ్రామసభల నిర్వహణకు టెంట్లు, మైక్ సెట్ లు, త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రజల సమ్మతితో గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామసభలు నిర్వహించు గ్రామపంచాయతీ సెక్రటరీలకు తగిన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభలలో సంక్షేమ పథకాల పట్ల ప్రజల సందేహాలను అధికారులు నివృత్తి చేయాలన్నారు. గ్రామ సభలకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని, సంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ పథకాల అర్హుల పూర్తి జాబితాను గ్రామ సభలలో ప్రదర్శించాలని అన్నారు. చాలా సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న రేషన్ కార్డ్ దరఖాస్తులు మరియు ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా రేషన్ కార్డు లేని వారికి ప్రభుత్వమే కొత్త రేషన్ కార్డు మంజూరు చేయుటకు గాను విడుదల చేసిన అర్హుల జాబితాను గ్రామ సభలలో ప్రదర్శించాలన్నారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డు అందుతుందని, జాబితాలో పేరు రాని అర్హుల వద్దనుండి దరఖాస్తులను తీసుకునేందుకు వీలుగా గ్రామసభలలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ సేవ కేంద్రాలలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న జాబితా మరియు మార్పులు చేర్పులు కోసం దరఖాస్తు చేసుకున్న జాబితాను కూడా గ్రామ సభలలో ప్రదర్శించాలన్నారు. చిట్ట చివరి అర్హుల వరకు సంక్షేమ పథకాలు అందేలా తగిన చర్యలు చేపట్టాలని, సంక్షేమ పథకాల అమలు అనేది నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలలో నాలుగు సంక్షేమ పథకాలకు వచ్చినటువంటి దరఖాస్తుల వివరాలను, మరియు గ్రామసభ తీర్మానాలను నిర్దేశిత పట్టిక ద్వారా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి, పిడి హౌసింగ్ శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఏవో రమాదేవి మరియు వ్యవసాయ శాఖ ఏ డి లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి

**- గ్రామ సభల్లో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలి**

**- గ్రామ సభల్లో కొత్త దరఖాస్తుల స్వీకరణ**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




జనగామ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): గ్రామ/వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. సోమవారం, జిల్లాలోని సమీకృత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆర్డీవోలు, ఎస్డీసీలు, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహసీల్దార్ లు, అన్ని మండల, వార్డు స్థాయి క్లస్టర్ అధికారులతో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గ్రామ/వార్డు సభల నిర్వహణపై జూమ్ మీట్ (టెలీ కాన్ఫరెన్స్) ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26న ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ/వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని, గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు నీడ, టెంట్ లు, కుర్చీలు, బల్లలు, తివాచీలను పరచాలని, తాగునీరు వంటి తదితర మౌలిక వసతులను కల్పించాలని, గ్రామ/వార్డు స్థాయిలో ఎటువంటి సమస్యలకు తావివ్వకుండా సమయానుగుణంగా జరిగేలా చూడాలని, ఫ్లెక్సీ లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ/వార్డు సభల బృందంలో ఏఈఓ, పంచాయతీ కార్యదర్శి, ఆర్ఐ, ఫీల్డ్ అసిస్టెంట్, క్లస్టర్ అధికారి ఉంటారన్నారు. ఈ సభల ప్రారంభానికి ముందు ప్రభుత్వం జారీ చేసిన సందేశాన్ని ఖచ్చితంగా చదివి, వినిపించాలని తెలిపారు. గ్రామ/వార్డు సభలకు హాజరయ్యే ప్రజల నుంచి సంతకాలను సేకరించాలని, అలాగే హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని, ఆ హెల్ప్ డెస్క్ ల ద్వారా కొత్త దరఖాస్తులను, సర్వే పరిశీలన అభ్యంతరాలను స్వీకరించాలని వెల్లడించారు. రైతు భరోసా సర్వే అర్హుల ముసాయిదా జాబితా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితా, రేషన్ కార్డులకు సంబంధించి ప్రజాపాలన దరఖాస్తుల జాబితా, మీ-సేవా దరఖాస్తుల జాబితా, సర్వే పరిశీలనలో లబ్ధిదారుల ముసాయిదా జాబితా, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్న వారి జాబితా, ఇంటి స్థలం లేని వారి రెండు జాబితాలను ఈ సభలలో ప్రదర్శించాలని, చదివి వినిపించాలని, ఏ ఒక్క జాబితాలో కూడా తప్పిదాలకు గురికావొదన్నారు. ఈ లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతరం కొనసాగుతుందని, ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ సభల పట్ల విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఈ పథకాలను ఎంతో జాగ్రత్తగా ప్రాధాన్యతతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా హెల్ప్ డెస్క్ ల వద్ద కొత్త దరఖాస్తులు, సర్వే పరిశీలన అభ్యంతరాల రిజిస్టర్ లను తప్పనిసరిగా సరైన విధంగా నిర్వహించాలని, ఆ రిజిస్టర్ లలో ప్రతిదీ నమోదు చేయాలని, వాటిని ఎంపిడిఓ కార్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ సభల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, సమర్థవంతంగా పనిచేయాలని, అందుకు తగ్గట్లుగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని, ప్రతి గ్రామ/వార్డు సభల్లో పటిష్టమైన పోలీసు భద్రతను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ జూమ్ మీట్ సమీక్షలో జెడ్పీ సీఈవో మాధురీ షా, జనగామ ఆర్డీవో గోపీరామ్, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీవో వెంకన్న, యూనిట్ 1, 2ల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, డిప్యూటీ సీఈఓ సరిత, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ వసంత, డీపీఓ స్వరూప, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, క్లస్టర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లకు వినూత్న మెట్రో మార్గాలు

**- ఈ రెండింటితో ఎయిర్‌పోర్ట్ కారిడార్ అనుసంధానం**

**- సీఎం సూచన మేరకు జేబీఎస్‌ను ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌గా అభివృద్ధి చేస్తాం : మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

**- కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో ఎండీ క్షేత్రస్థాయి పరిశీలన**




సిటీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ముఖ్యంగా మేడ్చల్, శామీర్‌పేట్ దిశగా సాగే కారిడార్లు కొత్త రూపురేఖలు సంతరించుకోనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సారథ్యంలో సాంకేతిక నిపుణులు, అధికారులు హైదరాబాద్ ప్రజల సౌకర్యవంతమైన ప్రయాణానికి కొత్త మెట్రో మార్గాలను రూపొందించే కసరత్తును ప్రారంభించారు. ఫేజ్-2 పార్ట్ 'బీ'లో ప్యారడైజ్ %-% మేడ్చల్ (23కి.మీ), జేబీఎస్-శామీర్‌పేట్ (22కి.మీ) ప్రతిపాదిత కారిడార్ అలైన్‌మెంట్ల విషయంలో ఉన్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదారులు ఆదివారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ రెండు కారిడార్ల ఏర్పాటులో ఇంజినీరింగ్ పరంగా ఎదురవుతున్న కొన్ని సంక్లిష్ట అంశాలను గుర్తించారు. బేగంపేట్ విమానాశ్రయ సరిహద్దు వెంబడి ప్యారడైజ్ నుంచి బోయినపల్లి వరకు రోడ్డు వంపు చాలా ఎక్కువగా ఉండటం, విమానాశ్రయ అధికారుల ఆంక్షల కారణంగా హెచ్ఎండీఏ తన ఎలివేటెడ్ మార్గాన్ని కొంత దూరం పాటు భూగర్భ మార్గంగా మార్చుకుంది. ఈ అలైన్‌మెంట్‌ను బేగంపేట విమానాశ్రయం(తాడ్‌బండ్-బోయినపల్లి వైపు) రన్‌వే కింద దాదాపు 600 మీటర్ల దూరం భూగర్భ సొరంగం ద్వారా తీసుకువెళ్తుంది. హెచ్ఎండీఏ మార్గానికి అనుసంధానంగా రెండు స్థాయిలపైన ఉండే డబుల్ ఎలివేటెడ్ మెట్రో మార్గాన్ని ఈ భూగర్భ సొరంగంలోకి దింపి, మళ్లీ రెండు స్థాయిల ఎలివేటేడ్ మార్గంగా పైకి తీసుకురావడం అనేది ఇంజినీరింగ్ పరంగా అనేక సమస్యల్ని సృష్టిస్తుంది. ఈ సమస్యలను విశ్లేషించి అనువైన మార్గానికి ప్రణాళికలు సిద్ధం చేయడానికి మెట్రో అధికారులు నడుం బిగించారు. అలాగే, ముఖ్యమంత్రి సూచించిన ప్రకారం మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్‌ల ప్రారంభం స్థానాన్ని జేబీఎస్ వద్ద ఏకీకృతం చేయడం, ఇక్కడ ప్రపంచ స్థాయిలో ఒక హబ్‌ని ఏర్పాటు చేయడం, ఈ కారిడార్లు కొంత దూరం వెళ్లిన తర్వాత వాటిని విడదీసి, రెండు మెట్రో కారిడార్లుగా రూపొందించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని తమ క్షేత్ర పర్యటనను మెట్రో ఎండీ కొనసాగించారు. తన బృందంతో కలిసి కంటోన్మెంట్ ప్రాంతంలోని అనేక ప్రత్యామ్నాయ రోడ్లపై పూర్తిగా నడిచి, సాధ్యమైనంత ఉత్తమమైన మెట్రో రైలు అలైన్‌మెంట్ ఏర్పాటుకు పరిశీలనలు జరిపారు.

# ప్రజారోగ్యంతో చెలగాటం

భద్రాద్రి: వాటర్ శుద్ధి ప్లాంట్ నుంచి కొనుగోలు చేస్తున్న త్రాగునీటి వినియోగం నేడు సర్వసాధారణమైంది ఆరోగ్య రక్షణ దృశ్య ప్రజల తమ దైనందిన జీవితంలో దీన్ని భాగంగా చేసుకుంటున్నారు దాదాపు ప్రతి పల్లెలో కూడా ప్లాంట్ వెలిశాయి కొన్నిచోట్ల నీటితోపాటు అనారోగ్యాన్ని కొనుక్కొని వస్తున్నామని విషయాన్ని ప్రజలు గ్రహించడం లేదు మండలంలో కొందరు నిర్వాహకులు నిబంధనలకు తెలియదు ప్రజారోగ్యంతో చెలగాట మాడు తున్నారు నిబంధనలు పాటించకుండా వ్యాపారం చేస్తున్నారు వేసవిలో మంచి నీటి వినియోగం ఎక్కువగా ఉండడంతో మణుగూరు పరిసర ప్రాంతాల్లో ప్రస్తుత నీటి వ్యాపారం జోరుగా సాగుతుంది డబ్బాను పట్టణంలో పల్లెల్లో10 నుంచి 15 రూపాయల వరకు విక్రయిస్తున్నారు మణుగూరులో సుమారు 25 కు పైగా మినరల్ వాటర్ ప్లాంట్ లు ఉన్నాయి వీటిల్లో చాలా వాటికి అనుమతులు లేవు గతంలో నిర్వాహకులే ఇంటింటికి క్యాన్లు సరఫరా చేసేవారు అలవాటు పడిన తర్వాత చాలాచోట్ల ప్రజలే ప్లాంట్ల వద్దకు వెళ్లి మంచినీరును తీసుకొచ్చుకుంటున్నారు తాగునీటి సిద్ది ప్లాంట్ నిర్వాహకులు శుద్ధ జలం ప్లాంట్లు ఏర్పాటుకు బి ఐ ఎస్ అనుమతి తప్పనిసరి క్రమబద్ధీకరించుకోవాలి ప్లాంట్ ఏర్పాటు కోసం పక్కా భవనం ఉండాలి ఎటు చూసినా 15 అడుగుల వైశాల్యంతో విశాల గది ఏర్పాటు చేసుకోవాలి నిత్యం గోరువెచ్చని నీటితో క్యాన్లను శుభ్రం చేయాలి నీటిని నింపేందుకు శుద్ధికి వేరువేరు యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి శుద్ధి కోసం రసాయ నాలు మోతాదుని కలిపేందుకు రెండు ప్రయోగశాలలో తప్పనిసరి ఇందులో రసాయన శాస్త్రం, మైక్రో బయాలజీలో పీజీ పూర్తి చేసిన ఇద్దరు నిపుణులు నియమించాలి ప్రత్యేక రిజిస్టర్ నిర్వహిస్తూ అందులో నీటి పరీక్ష వివరాలు పొందపరచాలి ఆరు నెలలకోసారి ప్రయోగశాలలో శుద్ధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి కానీ జిల్లాలో వేళ్ళ మీద లెక్కించగలిగే సంఖ్యలో ప్లాంట్లకే బిఎస్ఐ అనుమతులు ఉన్నాయి చాలా చోట్ల ఒకే గదిలో ప్లాంట్ నిర్వహిస్తున్నారు మండలంలో ఎక్కడ కూడా గోరువెచ్చనిటిని శుభ్రతకు ఉపయోగించడం లేదు ఫిల్లింగ్ ప్యూరిఫైడ్ కు అన్నిచోట్ల రెండు ట్యాంకులు ఉన్నాయి ప్రయోగశాల నిపుణుల మాట నుంచి చేతికి అందినంత పరిమాణంలో రసాయనాలు కలుపుతున్నారు రిజిస్టర్లు నిర్వహణ ఎక్కడ అమలు కావడం లేదు.

# వ్యక్తి దారుణ హత్య..

**- సంఘటన స్థలాన్ని డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీ**
**- పోలీసుల అదుపులో అనుమానితులు..?**




రామారెడ్డి : గుర్తుతెలియని దుండగులు వ్యక్తిని హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పొక్కిలి రవిని(41) శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పదునైన ఆయుధంతో పొడిచి దారుణంగా హత్య చేసి చంపినట్లు భార్య రంజిత తెలిపింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కామారెడ్డి డి.ఎస్.పి చైతన్య రెడ్డి, సిఐ రమణ పరిశీలించారు. డాగ్స్ స్క్వాడ్‌తో పరిశీలించారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తుంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

# షరతులు లేకుండా రైతు భరోసా

**- వ్యవసాయ యోగ్యమైన రైతుల భూములకు ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరానికి 12 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం**
**- గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక**
**- ఎలాంటి అపోహలకు తావులేదు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



ఎర్రుపాలెం: వ్యవసాయ యోగ్యమైన రైతుల భూములకు ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరానికి 12 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందించబోతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో రూ.1.56 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరి చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేలు అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, లబ్ధిదారులను గ్రామ సభల్లో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎంపిక చేస్తారని, ఎలాంటి అపోహలు, అనుమానాలు చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ప్రజా పాలనలో ప్రజలందరి సమక్షంలోనే నిర్ణయాలు తీసుకుంటారని, గ్రామ సభలు నిర్వహించి సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను తయారు చేస్తారన్నారు. లిస్ట్‌లో పేర్లు రానివారికి అక్కడే సమస్య పరిష్కరిస్తారని క్లారిటీ ఇచ్చారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మండలంలో ఉన్న చెరువులు అడవులను రక్షించుకుంటూ ఎకో టూరిజాన్ని అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. మండలంలో టూరిజం అభివృద్ధితో స్థానిక ప్రజల ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రజా ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన పార్టీ సీపీఐ


**- కూడు, గూడు, భూమి కోసం పోరాటాలతో పేదల పక్షాన నిలిచింది**
**- మనమెందుకు అధికారంలోకి రాలేకపోతున్నామో ఆలోచన చేయాలి**
**- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి**
**- సిద్దిపేటలో ఘనంగా సీపీఐ శతజయంతి వేడుకలు**




సిద్దిపేట అర్బన్: భారత కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీ అని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. కూడు, గూడు భూమి, కోసం అనేక పోరాటాలు చేసి పేదల పక్షాన నిలిచిన ఘనత సీపీఐదేనని అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శివానుభవ మండపం హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ శతజయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని విక్టరీ టాకీస్ నుంచి శివమ్స్ ఫంక్షన్ హాల్ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. శతజయంతి సభలు జరుపుకున్నాం కానీ.. మనం అధికారంలోకి ఎందుకు రాలేకపోతున్నామో ఒకసారి ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రపంచంలోని చైనా, వియత్నాం, ఫిలిప్పీన్స్, క్యూబా వంటి దేశాల్లో పేదలకు విద్యా వైద్యం అందించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అక్కడి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. భారతదేశంలో ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. కార్మికుల హక్కులు హరించే విధంగా ఎన్డీయే ప్రభుత్వం చట్టాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని, వాటిపై ఏఐటీయూసీ, ఇతర కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి పోరాటాలు చేయడంతో వెనక్కి తగ్గిందని తెలిపారు. దున్నేవానికే భూమి కావాలని పోరాటాలు చేసి అనేకమంది అసువులు బాసారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ప్రజల్లో ఉండి పేదల హక్కులకోసం మరోసారి పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎడ్ల వెంకట రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గడిపే మల్లేష్, బట్టు దయానంద రెడ్డి, అందే అశోక్, ఎడల వనేష్, పోతిరెడ్డి వెంకటరెడ్డి, కిష్టపురం లక్ష్మణ్, జాగిరి సత్యనారాయణ గౌడ్, కనుకుంట్ల శంకర్, స్వాతంత్ర్య సమరయోధులు గంబీరపు రామయ్య, పట్టణ కార్యదర్శి జి. బన్సీలాల్, మహిళా సమాఖ్య అధ్యక్షులు గూడ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ ఐటీ పార్క్

**- రూ. 450 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం**
**- 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు**
**- క్యాపిటల్‌ల్యాండ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ చర్చలు**




హైదరాబాద్: హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి పెట్టేందుకు సింగపూర్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ ముందుకొచ్చింది. రాష్ట్రంలో రూ.450 కోట్లతో అత్యాధునిక ఐటీ పార్కు ఏర్పాటు చేస్తున్నట్టు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ప్రకటించింది. ఆ దేశంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందంతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో కంపెనీ నిర్ణయం తీసుకుంది. 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. క్యాపిటల్ ల్యాండ్ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలుస్తుందని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయ పడ్డారు. బ్లూ చిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలు ఐటీ పార్కులో అందుబాటులో ఉంటాయి. కంపెనీ ఇండియా ట్రస్ట్ మేనేజ్‌మెంట్ సీఈవో గౌరీశంకర్ నాగభూషణం మాట్లాడుతూ రేవంత్ సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిర వృద్ధి చెందుతోందనీ, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించటం ఆనందంగా ఉందని అన్నారు. క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో అంతర్జాతీయ టెక్ పార్క్ (ఐటీపీహెచ్), అవాన్స్ హైదరాబాద్, సైబర్‌పెర్ల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలో అందుబాటులోకి రానుంది. ఐటీపీహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తి కానుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, క్యాపిటల్ ల్యాండ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

**- అధికారంలో ఉన్నప్పుడు కూలీలకు ఏకాన ఇవ్వనోళ్లు ఏదేదో మాట్లాడుతున్నరు**
**- కోటీశ్వరులకు రైతు బంధు ఇచ్చి కష్టజీవులను విస్మరించారు**
**- అపోహలు వీడి కూలీ భరోసాను స్వాగతించండి :మాజీమంత్రి హరీశ్‌రావుకు మంత్రి సీతక్క కౌంటర్**



హైదరాబాద్: 'భూమి లేని ఉపాధి కూలీలకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉపాధీ కూలీలకు రెండు దఫాల్లో ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సహాయం అందివ్వబోతున్నది. దేశానికే ఆదర్శంగా నిలవబోతున్నది. యావత్ దేశం ఈ స్కీం పట్ల ఆసక్తి చూపుతుండగా..తెలంగాణలోని కొన్ని రాజకీయ శక్తులు ఈ పథకంపై తప్పుడు గణాంకాలతో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయి. పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు కూలీలకు ఏకాన ఇవ్వని నేతలు ఇప్పుడు వారిపై కపట ప్రేమ నటిస్తున్నారు. రూ. 500 కోట్ల ఆస్తులున్న వారికి సైతం రైతు బంధు ఇచ్చి..రెక్కల కష్టం తప్ప ఎలాంటి ఆస్తి పాస్తులు లేని కూలీలను పట్టించుకోలేదు. ఇప్పుడు కూలీలకు ఆర్థిక చేయూతనందిస్తుంటే చూసి ఓర్వలేక అక్కసు వెళ్లగక్కుతున్నారు' అని మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుటుంబం యూనిట్‌గా అమలవుతున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సైతం అదే నిబంధన వర్తిస్తోందని తెలిపారు. ఎమ్‌జీనరేగా పోర్టల్ అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణలో 48,13,966 జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలున్నాయనీ, అందులో 22.64 లక్షల కుటుంబాలు కనీసం ఒక్క రోజు కూడా ఉపాధి పనుల్లో పాల్గొనలేదని తెలిపారు. కేవలం జాబ్ కార్డు కలిగి ఉన్నంత మాత్రాన ఉపాధి కూలీగా పరిగణించలేమని స్పష్టం చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా జీవనోపాధి పొందితేనే ఉపాధి కూలీగా పరిగణిస్తామని తెలిపారు. సుమారు 17.26 లక్షల వరకు కుటుంబాలే 20 రోజుల పనిని పూర్తి చేసుకున్నాయనీ, అందులో 11 లక్షల కు పైగా కుటుంబాలకు సొంత భూమి ఉండటంతో రైతు భరోసా లబ్ధిదారులుగా ఉన్నారని వివరించారు. ఎలాంటి భూమి లేని 6 లక్షలకు పైగా ఉపాధి కూలీ కుటుంబాలుంటాయన్న అంచనాతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాజకీయ పక్షపాతంతో వ్యవహరించకుండా గ్రామ సభల్లోనే, ప్రజల సమక్షంలోనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

# నాపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై నో కామెంట్**
**- పేదల ఇండ్లను కూలిస్తే ఊరుకోబోం.. కొట్లాటకు సిద్ధం : ఎంపీ ఈటల**



హైదరాబాద్: తమ పార్టీ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్నవారే తనపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి అంశంపై తాను ఎలాంటి కామెంట్ చేయబోనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పేదల ఇండ్లను కూలుస్తుంటే చూస్తూ ఊరుకోబోమనీ, కొట్లాటాకు తాము కూడా సిద్ధమేనని ప్రకటించారు. అత్యంత అవినీతి, అసమర్థ, మంత్రుల మధ్య సమన్వయం లేని ప్రభుత్వం రేవంత్‌రెడ్డి సర్కారేనని విమర్శించారు. ప్రతి బిల్లు చెల్లింపులోనూ 7 నుంచి 10 శాతం వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొన్ని రోజులు హైడ్రా పేరిట, మరికొన్ని రోజులు మూసీ పేరిట పేదల ఇండ్లను కూల్చిందని విమర్శించారు. దేశంలోనే అతిపెద్ద, అతిపురాతనమైన స్లమ్ బాలాజీనగర్, జవహర్‌నగర్ ప్రాంతమనీ, ఆ ప్రాంతంలో రాష్ట్ర ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా వలస వచ్చిన ఎంతోమంది కూలీలు, పేదలు నివసిస్తున్నారని తెలిపారు. ప్రజలు కబ్జా చేసుకుని ఇండ్లు కట్టుకోలేదనీ, డబ్బులు పెట్టి కొని కట్టుకున్నారని చెప్పారు. బ్రిటీష్ కాలంలో ఈ భూమిని సైనికులకు కేటాయించారన్నారు. ఆ భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదనీ, కేర్ టేకింగ్ మాత్రమే చేపట్టాలని 1951లోనే స్పష్టంచేశారని తెలిపారు. సైనికులు కొందరు ఆ భూమిని అమ్ముకుంటే వారి నుంచి పేదలు కొనుక్కున్నారని చెప్పారు. గతంలోనూ కాంగ్రెస్ మంత్రి కమఠం రాంరెడ్డి ఆ ప్రాంతంలో ఇండ్లను కూల్చాలని మిషన్లను పంపారనీ, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూల్చివేతలు చేయిస్తున్నారని విమర్శించారు. బాలాజీ నగర్‌లో పేదల ఇండ్లను కబ్జా చేసేవాళ్లు, అమ్మకాలు, కొనుగోలు చేసే బ్రోకర్లు ఎక్కువైపోయారనీ, రెవెన్యూ అధికారుల ఆగడాలు శృతిమించిపోతున్నాయని ఆరోపించారు. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు చెల్లిస్తే తప్ప రేకుల షెడ్లు వేసుకునేందుకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. డబ్బులివ్వకపోతే ఇండ్లను కూల్చివేయిస్తున్నారని ఆరోపించారు. మల్కాజిగిరి ఎంపీగా పనిచేసిన సీఎం రేవంత్ కు ఈ ప్రాంత ప్రజల బాధలు తెలియవా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం విచారణకు సహకరిస్తారా? అన్న అంశంపై ఈటల స్పందిస్తూ..మిడిమిడి జ్ఞానంతో ఉన్నవాళ్లు, అవగాహన లేనివాళ్లు, ప్రభుత్వ పనివిధానం తెలియనివాళ్లు ఏదేదో మాట్లాడుతున్నారనీ, అన్ని డిపార్ట్ మెంట్లు బిల్లులు చేసి పంపిస్తే డబ్బులు రిలీజ్ చేసేది ఆర్థికశాఖ అని తెలిపారు. బిల్లులు రిలీజ్ అవ్వాలంటే 7 నుంచి 10 శాతం కమీషన్ లేనిదే రిలీజ్ చేయడం లేదని విమర్శించారు.

# ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం

**- కార్మిక-కర్షక పోరాటాలను ఉధృతం చేయాలి : కార్మిక కర్షక ఐక్యత ర్యాలీలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్**




కంఠేశ్వర్: ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. కార్మిక కర్షక పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. 1982లో తమిళనాడులో రైతాంగ హక్కుల కోసం జరిగిన కార్మిక, కర్షక రైతాంగ ప్రదర్శన పైన ఆనాటి ప్రభుత్వం విచక్షణా రహితంగా జరిపిన కాల్పులలో 10 మంది నాయకులు అక్కడికక్కడే చనిపోయారు. వారిలో నలుగురు వ్యవసాయ కార్మికులు, ముగ్గురు రైతులు, ముగ్గురు కార్మికులు ఉన్నారని వారి పోరాటాన్ని స్మరించుకుంటూ జనవరి 19న సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించాలనే దేశవ్యాప్త పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ భవన్ నుంచి హమాల్‌వాడీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మూడ్ శోభన్‌తో పాటు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడారు. ఆనాడు కార్మిక కర్షక నేతలు లేవనెత్తిన కోరికలు నేటికీ నెరవేరలేదని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బెనారస్ నగరంలో కార్మిక వర్గ ప్రదర్శనపైన జనవరి 19న ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి కాల్పులు జరిపిందని, నిర్బంధంతో ఉద్యమాన్ని అణిచివేయాలని చూసిందని తెలిపారు. నేడు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక కోడ్‌ల పేరుతో 44 కార్మిక చట్టాలను మూడు కోడ్‌లుగా మార్చి నిర్బంధ శ్రమ దోపిడీకి పూనుకోవాలని చూస్తున్నదని అన్నారు. మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూసిందని, పూర్తిగా మార్కెట్‌ను ప్రయివేటుపరం చేయబోతున్నారని, విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించి రైతాంగ బోర్‌లకు మీటర్లు బిగించి డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నదని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయకుండా ఎత్తివేయాలని కుట్ర జరుగుతుందని విమర్శించారు. ఆన్‌లైన్ పేమెంట్, ఆన్‌లైన్ మస్టర్, ఆధార్ కార్డు అనుసంధానం పేరుతో కూలీల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. బడ్జెట్లో నిధులను పూర్తిగా తగ్గించిందని, దీనివల్ల పెద్ద ఎత్తున పని దినాలు పడిపోయాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జె శంకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం గోవర్ధన్, లక్ష్మి, చామతి లక్ష్మి, జిల్లా కార్యదర్శి విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తో కేపీహెచ్బీకి గండం

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వచ్చిందంటేనే కూకట్ పల్లి నియోజకవర్గంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి గండం వచ్చినట్లు తయారవుతుందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వ్యాఖ్యానించారు. హౌసింగ్ బోర్డ్ సంబంధించి స్థలాలను బహిరంగ వేలానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడంతో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాలనీకి సంబంధించిన మూడు గజాల నుండి 300 గజాలకు పైగా స్థలాలను అమ్మేందుకు ప్రకటన జారీ చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే స్పందించారు. హౌసింగ్ బోర్డు స్థలాలకు సంబంధించి ఆరు గజాలు, మూడు గజాలు, 50 గజాలకు సంబంధించిన స్థలాలను ప్రభుత్వం అమ్ముకోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రజలకు సంబంధించిన స్థలాలను ప్రభుత్వం అమ్మడం హేయమైన చర్య అని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం వదిలేసిన స్థలాలను వేలం వేయడం ద్వారా వచ్చే సొమ్మును ప్రభుత్వం తీసుకోవాలని భావిస్తుందని అన్నారు.

# నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఫోకస్

వరంగల్: తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి చేసుకుంది. అయితే క్షేత్రస్థాయిలోని చాలా మంది ముఖ్య నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. కొంతమందికే అవకాశాలు దక్కగా? మరికొంత మంది నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా భర్తీ చేయాలని కోరుతున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి ఏడాది పూర్తైపోయింది. ఓవైపు సంక్షేమ పథకాలను పట్టాలెక్కించే పనిలో ఉంటూనే.. మరోవైపు రాజకీయంగానూ బలపడే అవకాశాలపై ఫోకస్ పెడుతూ వస్తోంది. బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలను కూడా చేర్చుకుంది. కట్ చేస్తే.. త్వరలోనే స్థానిక ఎన్నికల నగారా మోగనుంది. ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పాగా వేసి? గ్రౌండ్ లో మరింత బలపడాలని భావిస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పట్నుంచి? పార్టీలోని చాలా మంది నేతలు పదవులపై ఆశలు పెంచుకున్నారు. రేపు మాపు అంటూ భర్తీ ప్రకటనలు వస్తున్నప్పటికీ? ముహూర్తం మాత్రం ఖరారు కావటం లేదు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత? కొన్ని పదవులను భర్తీ చేశారు. అయితే ఇంకా చాలా కార్పొరేషన్లతో పాటు జిల్లా, నియోజకవర్గస్థాయిలో నామినేటెడ్ పదవులు ఉన్నాయి. అయితే పార్టీ కోసం పని చేసిన నేతలను గుర్తించి? పదవులను ఇవ్వాలని నేతలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని పదే పదే అధినాయకత్వం దృష్టికి కూడా తీసుకెళ్తున్నారు. ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు.గతేడాది చివరల్లోనే పీసీసీ అధ్యక్షుడిగావ మహేశ్ కుమార్ గౌడ్ ను నియమించారు. ఆయన జిల్లాల్లో పర్యటనలు చేస్తున్నారు. పార్టీ బలోపేతం కోసం కీలక నిర్ణయాలు ఉంటాయని చెబుతున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని పదే పదే స్పష్టం చేస్తున్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా? అందరూ కలిసి పని చేయాలని దిశానిర్దేశం చేస్తున్నారు. పని చేసిన వారికే గుర్తింపు ఉంటుందని చెప్పుకొస్తున్నారు.నామినేటెడ్ పదవులే కాదు? పార్టీ కార్యవర్గంలోనూ మార్పులు చేయనున్నారు. పార్టీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి? కొత్త నియామకాలను చేపట్టాలని టీపీసీసీ భావిస్తోంది. అయితే నామినేటెడ్ పదవులతో పాటే కార్యవర్గంలో కూడా మార్పులు చేసే విషయంపై అధినాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలిస్తోంది. ఇటీవలే మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్? ఈనెలాఖరా నాటికి నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ఓ ప్రకటన కూడా చేశారు. అధినాయకత్వం గ్రీన్ సిగ్నల్ రాగానే?. ఈ ప్రక్రియ పట్టాలెక్కుతుందని చెప్పుకొచ్చారు.అటు ప్రభుత్వంలో ఇటు పార్టీలో పదవుల భర్తీ ఆలస్యం అవుతుండటంతో పార్టీలోని నేతలు పూర్తి నిరాశ నిస్పృహలో ఉన్నారన్న టాక్ వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ముందే..నామినేటెడ్ పోస్టుల భర్తీని పూర్తి చేయాలని నేతలు కోరుతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో? రాష్ట్ర నాయకత్వం ఏం చేయబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ టీపీసీసీ నిర్ణయం తీసుకున్నా? ఢిల్లీ నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తుదా..? లేక మరికొన్ని రోజులు ఆపుతుందా..? అనే విషయంలో కూడా క్లారిటీ రావాల్సి ఉంటుంది.పార్టీ పరంగా భర్తీ ప్రక్రియ ఆలస్యమవుతున్నప్పటికీ పదవులు ఆశిస్తున్న నేతలు? మాత్రం వెనక్కి తగ్గటం లేదు. ఎవరికి వారుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కింది స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు పావులు కదుపుతున్నారు. ఎలాగైనా పదవి దక్కించుకోవాలని? రాజకీయంగా బలపడాలని చూస్తున్నారు. ప్రస్తుతం ఆశల పల్లకిలో ఉన్న నేతల్లో ఎంత మందిని అదృష్టం వరిస్తుందో చూడాలి?!

# మరో ఫ్లై ఓవర్ రెడీ...

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. అయితే నగరవాసులకు ట్రాఫిక్ ఫ్రీ జర్నీ అందించడానికి తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూనే ఉంది. ఈ క్రమంలోనే ఫ్లైఓవర్, అండర్ పాస్‌లు, స్కైవేలు.. ఇలా ఎన్నోరకాల చర్యలు తీసుకుంటోంది. రద్దీగా ఉండే జంక్షన్ల వద్ద అనేక ఫ్లైఓవర్లు నిర్మించడం వల్ల ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే నగరంలో ఇప్పటికే చాలా ఫ్లైఓవర్లు అందుబాటులోకి రాగా.. తాజాగా మరొకటి రెడీ అయింది. త్వరలోనే ప్రారంభోత్సవం జరుపుకుని.. వాహనదారుల ట్రాఫిక్ తిప్పలకు అడ్డుకట్ట వేయనుంది. ఇందులో భాగంగానే అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ త్వరలోనే వాహనదారులకు అందుబాటులోకి రానుంది4 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు ఈ మధ్యే పూర్తి అయ్యాయి. రూ.445 కోట్లతో గోల్నాక నుంచి ఛే నంబర్ జంక్షన్ మీదుగా ముర్తుం హోటల్ వరకు ఈ ఫ్లై ఓవర్‌ను నిర్మించారు. మొత్తంగా 1.625 కిలోమీటర్ల పొడవుతో నాలుగు లేన్లతో ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో కోర్ సిటీలో నేషనల్ హైవే అథారిటీ నిర్మించిన మొట్టమొదటి ఫ్లై ఓవర్ ఇదే కావడం గమనార్హం. అయితే ఈ ఫ్లైఓవర్ భూసేకరణకు కావాల్సిన రూ. 140 కోట్లను మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చింది. అయితే ఈ అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు 2018లోనే శంకుస్థాపన చేసినా.. 2021 వరకు పనులు మొదలు కాలేదు. అయితే 2021లో పనులు ప్రారంభించిన ఈ ఫ్లై ఓవర్ పనులను 2023 చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా అది ఇప్పటికి పూర్తయింది. మొదట రూ.216 కోట్ల అంచనా వ్యయంతో ఈ ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించినా.. అది కాస్తా రూ.445 కోట్లకు చేరుకుంది. ఇందులో రూ.117 కోట్లు స్ట్రెచర్ కాస్ట్ కాగా.. రూ.99 కోట్లు భూసేకరణ కోసం ఖర్చు అవుతుందని భావించారు.అయితే ఆ మార్గంలో ఉన్న రెండు వర్గాలకు చెందిన కట్టడాల పైనుంచి ఫ్లై ఓవర్ నిర్మించేందుకు వారు ఒప్పుకోలేదు. దీంతో కొంతమేర ఆ రూట్‌ను మార్చడం.. భూసేకరణ అధికంగా కావడం.. సమయం కూడా ఆలస్యం కావడంతో రూ.445 కోట్ల అంచనాతో ఈ ఫ్లైఓవర్ పనులను రివైజ్ చేశారు. ఇందులో రూ.265 కోట్లు స్ట్రెచర్ కాస్ట్.. రూ.180 కోట్లు భూ సేకరణ కోసం ఖర్చు చేశారు. ఈ రూ.180 కోట్ల భూసేకరణ వ్యయంలో రూ.140 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది.ఇక ఈ అంబర్‌పేట ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఉప్పల్ నుంచి ఎంజీబీఎస్ వెళ్లేవారితో పాటు సిటీ నుంచి వరంగల్ హైవే వైపు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరడంతో పాటు.. వారి ప్రయాణ సమయం కూడా తగ్గనుంది. గతంలో ఛే నంబర్, శ్రీరమణ జంక్షన్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే చాదర్‌ఘాట్ నుంచి సిగ్నల్ లేకుండా తగలకుండా రామాంతాపూర్, హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 వరకు సులువుగా చేరుకోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేదా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ వారు హాజరుకాలేని పక్షంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రారంభిస్తారని సమాచారం.

# హైదరాబాద్ లో బీదర్ గ్యాంగ్...

హైదరాబాద్: హైదరాబాద్ నడిబొడ్డున పోలీసులపై కాల్పులు జరిపి తప్పించుకున్న బీదర్ గ్యాంగ్ కోసం వేట కొనసాగుతోంది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపడుతున్నారు. కాల్పులు జరిపిన నిందితులు బోర్డర్ దాటిపోకుండా కట్టడి చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని చెక్ చేస్తున్నారు.బీదర్ పోలీసులపై బీదర్‌కు చెందిన నిందితులు కాల్పులు జరిపారు. బస్‌లో కాల్పులు జరపడంతో సంచలనంగా మారింది. ఇది వేరే రాష్ట్రానికి చందిన వారు అయినప్పటికి హైదరాబాద్‌లో జరగడంతో తెలంగాణ పోలీసులకు ఈ కేసు ప్రతిష్టాత్మకంగా మారిపోయింది. అందుకే బీదర్ పోలీసుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్న పోలీసులు వారి ఇచ్చిన క్లూస్ ఆధారంగా విచారణ చేపట్టారు. కర్ణాటకలోని బీదర్‌లో ఏటీఎం వాహనంపై కొందరు దుండగులు అటాక్ చేసి నగదు మాయం చేశారు. 93 లక్షలతో ఉడాయించారు. వాళ్ల ఫోన్‌లు ట్రాప్ చేసిన పోలీసులు వారంతా హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు. అందుకే వారిని పట్టుకునేందుకు బీదర్ పోలీసులు హైదరాబాద్ వచ్చారు. అఫ్జల్ గంజ్‌లోని ఓ ట్రైవెల్స్ ఆఫీస్ వద్ద పోలీసులను చూసిన దుండగులు కాల్పులు జరిపాడు. బీదర్‌లోని శివాజీ చౌక్ మధ్యాహ్నం దోపిడీ జరిగింది. ఓ ఏటీఎంలో నగదు నింపేందుకు డబ్బులు తీసుకొస్తున్న సిబ్బందిపై ఇదే ముఠా కాల్పులు జరిపి డబ్బులు ఎత్తుకెళ్లింది. అక్కడ ఓ బైక్‌పై పారిపోయారు. ఈ కాల్పుల్లో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. మరో వ్యక్తి కూడా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. అలా బీదర్‌లో చోరీకి పాల్పడిన దుండగులు బైక్‌పై హైదరాబాద్ వచ్చారు. వారి కదలికలను సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా తెలుసుకున్న పోలీసులు వారంతా హైదరాబాద్‌లో ఉన్నట్టు తేల్చారు. తీరా వాళ్లు వచ్చి గాలింపు చర్యలు చేపడుతుంటే వారిపైనే కాల్పులు జరిపి రెండు రాష్ట్రాల పోలీసులకకు మోస్ట్ వాటెండ్‌గా మారిపోయారు. ఇదే విషయాన్ని బీదర్ పోలీసుల నుంచి స్టేట్మెంట్ తీసుకున్న హైదరాబాద్ పోలీసులు అణువణువూ గాలిస్తున్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ నిందితుల కోసం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు నాలుగు బృందాలు ఫామ్ చేసినట్టు వెల్లడించారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని గాలిస్తున్నామని అన్నారు.ఆయుధాలు అక్రమంగా అమ్మే వ్యక్తిని పట్టుకొని 24 గంటలు గడవక ముందే ఇలా కాల్పులు జరగడం పోలీసులు హై అలర్ట్ అయ్యారు. బుధవారం నేరేడ్‌మెట్ రాచకొండ కమిషనరేట్ పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ యాదవ్ అనే పాతికేళ్ల కుర్రాడిని అరెస్టు చేశారు. రాంపూర్ బోహాలో ఉండే ఈ వ్యక్తి ఆరేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చాడు. ఇక్కడ సంపాదన ఖర్చులకు సరిపోవడం లేదని మళ్లీ ఊరెళ్లిపోయాడు. అక్కడే ఆయుధాలు విక్రయించే గ్యాంగ్‌తో చేతులు కలిపాడు. షాపూర్ గ్రామానికి చెందిన సంపత్‌యాదవ్ వద్ద రూ.20వేలకు .32ఎం.ఎం, ఒక తపంచా, 10 బుల్లెట్లు కొన్నాడు. వాటిని అమ్మి సొమ్ము చేసుకోవాలనుకున్నాడు. విషయాన్ని గ్రహించిన పోలీసులు అరెస్టు చేశారు. ఇది జరిగిన 24 గంటల్లోనే కాల్పులు పోలీసులను పరుగులు పెట్టించాయి.

# సైబర్ నేర నియంత్రణకు మొబైల్ యాప్

సికింద్రాబాద్: సైబర్ నేరాలను నియంత్రించేందుకు కేంద్ర టెలికాం కమ్యునికేషన్ ఆధ్వర్యంలో నూతనంగా సంచార సారధి మొబైల్ ఆప్ ను ప్రారంభించినట్లు డిజిటి ప్రశాంత్ పాటిల్ తెలిపారు. కేంద్ర టెలికాం కమ్యునికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా దృశ్యమాధ్యమం ద్వారా డిల్లీలో మొబైల్ యాప్ తో పాటు ఇంట్రా సర్కిల్ రోమింగ్ 4జి, 2.0 ఎన్ బి ఎం లను ప్రారంభించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలో సంచార సారధి మొబైల్ యాప్ ను రూపొందించినట్లు తెలిపారు. సైబర్ మోసాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ ఈ యాప్ ను ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. సంచార సారధి మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం సైబర్ మోసగాళ్ళ ఫోన్ కాల్స్, మెసేజ్ లు ఎక్కడినుండి వచ్చాయనేది గుర్తించేందుకు వీలుంటుందని అన్నారు. వెంటనే టెలికాం సంస్థతో పాటు పోలీసులకు సమాచారం చేరుతుందని సైబర్ మోసాలు చేసే వారిని పట్టుకునేందుకు ఈ యాప్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. 33 గ్రామాలకు 4ఞ సేవలు అందించడానికి 253 కొత్త సైట్లు మంజూరు చేయబడ్డాయని,ఇప్పటికే 196 గ్రామాలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.ఎన్ బి ఎం 2.0 కింద గ్రామీణ ప్రాంతాలలో బ్రాడ్ బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్షన్లను పెంచడంతోపాటు వాటి వేగవంతమైన సామర్థ్యంతో కూడిన ఇంటర్నెట్ సేవలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. ఆప్టికల్ ఫైబర్ ద్వారా దేశంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు సైతం ఇంటర్నెట్ సేవలను అందించడమే లక్ష్యమని అన్నారు.

# ఆర్టీసీకి కాసుల వర్షం

వరంగల్: వరంగల్ ఆర్టీసీకి సంక్రాంతి పండుగ కాసుల వర్షాన్ని కురిపించింది. సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో దాదాపు వారం రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించగా.. గతంతో పోలిస్తే ఈసారి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరింది.వరంగల్ రీజియన్ పరిధిలో హనుమకొండ, వరంగల్1, వరంగల్ 2, పరకాల, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు .. ఇలా మొత్తం 9 డిపోలు ఉండగా.. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది.వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను ఆదేశాల మేరకు పండుగ నేపథ్యంలో మొత్తంగా 927 బస్సులు 26.61 లక్షల కిలోమీటర్ల మేర నడిపించగా.. వారం రోజుల సమయంలో మొత్తంగా 26.42 లక్షల మంది ప్రయాణించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించగా.. ఓవరాల్ గా 16.30 లక్షల మంది మహిళలు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారు.ఇదిలా ఉంటే వరంగల్ రీజియన్ కు సాధారణ రోజుల్లో ప్రతి రోజు రూ.2 కోట్ల వరకు ఆదాయం వస్తుండగా.. కేవలం ఈ ఏడు రోజుల్లో రూ.16.47 కోట్ల ఆదాయం రావడం గమనార్హం. ఇందులో మహాలక్ష్మీ పథకం ద్వారా ప్రయాణించిన 16.30 లక్షల మంది నుంచి రూ.7.6 కోట్ల ఆదాయం రాగా.. టికెట్ ఛార్జీలు చెల్లించి ప్రయాణించిన 10.12 లక్షల మంది నుంచి రూ.8.86 కోట్ల లాభం వచ్చింది.వరంగల్ రీజియన్ పరిధిలోని తొమ్మిది డిపోల్లో అత్యధికంగా వరంగల్ ? 2 డిపో నుంచే ఆదాయం సమకూరింది. వరంగల్ 2 డిపో నుంచి బస్సులు 4.82 లక్షల కిలోమీటర్లు బస్సు సర్వీసులు నడవగా రూ.2.86 కోట్ల ఆదాయం వచ్చింది. వరంగల్ 1 డిపో నుంచి బస్సులు 3.72 లక్షల కిలో మీటర్లు నడవగా రూ.2.26 కోట్ల లాభం వచ్చింది.హనుమకొండ డిపో నుంచి 1.98 కోట్లు, జనగామ డిపో నుంచి 1.90 కోట్లు, తొర్రూరు నుంచి 1.84 కోట్లు, భూపాలపల్లి డిపో నుంచి రూ.1.64 కోట్లు, నర్సంపేట డిపో నుంచి రూ.1.63 కోట్లు, పరకాల డిపో నుంచి రూ.1.21 కోట్లు, మహబూబాబాద్ డిపో నుంచి 1.13 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇదిలాఉంటే హనుమకొండ డిపో పరిధిలో నడిచిన బస్సుల్లో అత్యధికంగా 4.36 లక్షల మంది ప్రయాణం చేయగా.. అత్యల్పంగా తొర్రూరు డిపో నుంచి 2.43 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారు.కాగా సమష్టి కృషి తోనే ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడిపించామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రద్దీ రూట్లపై ఎక్కువ ఫోకస్ పెట్టి బస్సులు తిప్పినట్లు పేర్కొంటున్నారు. కాగా ఆర్టీసీకి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరడంతో ఆఫీసర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# హ్యాట్సాఫ్ హైదరాబాద్ మెట్రో...

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ట్రాఫిర్ రద్దీ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. కొన్ని ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి. అత్యవసర సమయాల్లో నగరంలోని ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరుకోవటం చాలా కష్టమైన పని. అంబులెన్స్ వంటి ఎమర్జెన్సీ వాహనాలు సైతం వేగంగా వెళ్లలేని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో హైదరాబాద్ మెట్రో ఓ వ్యక్తికి ప్రాణం పోసింది. గ్రీన్ ఛానెల్ ద్వారా మెట్రోలో గుండెను తరలించటంతో వ్యక్తి ప్రాణం నిలిచింది. ఎల్బీనగర్ నుంచి లక్డీకపూల్ వరకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి సకాలంలో గుండె మార్పిడి చేయటంతో వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించినట్లయింది.వివరాల్లోకి వెళితే.. జనవరి 17న రాత్రి 8-9 గంటల సమయంలో ఒః నగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో ఓ వ్యక్తి బ్రెయిన్ డెడ్ కావటంతో అతడి అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. లక్డీకపుల్‌లోని గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్‌లో ఓ వ్యక్తి హృదయ సంబంధిత సమస్యలతో బాధపడుతుండటంతో అతడికి దాత గుండెను అమర్చాలని డాక్టర్లు భావించారు. అయితే ఎల్బీనగర్ నుంచి గ్లెనీగల్స్ ఆసుపత్రికి గుండెను తరలించటం సవాల్‌గా మారింది. ఈ దారిలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. సకాలంలో గుండెను తరలించకపోతే ఉపయోగం ఉండదు. దీంతో హాస్పిటల్ సిబ్బంది ఎల్బీనగర్ మెట్రోను ఆశ్రయించారు. వ్యక్తి ప్రాణం కాపాడేందుకు సహకరించాలని కోరారు.దీంతో వేగంగా స్పందించిన మెట్రో అధికారులు.. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఎల్బీనగర్ నుంచి లక్డీకపూల్ వరకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. మె?త్తం ఎల్బీనగర్ నుంచి 13 స్టేషన్లు.. 13 కిలోమీటర్లు.. 13 నిమిషాల్లో లక్డీకపూల్ హాస్పిటల్‌కు గుండెను చేర్చారు. వ్యక్తి ప్రాణాలను రక్షించే క్రమంలో క్లిష్టమైన సమయాన్ని ఆదా చేశారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో అధికారులు ప్రకటన విడుదల చేశారు. అత్యవసర సేవలకు మద్దతు ఇవ్వడానికి ఒడు మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడం ద్వారా హైదరాబాద్ మెట్రో సమాజ సంక్షేమానికి దోహదపడుతుందన్నారు.హైదరాబాద్ మెట్రో ప్రతినిత్యం లక్షల మందిని గమ్యస్థానాలకు చేరుస్తోంది. ట్రాఫిక్ రద్దీ లేకుండా నగరం ఓ మూల నుంచి మరో మూలకు చేరుకునేందుకు చాలా మంది మెట్రోను ఆశ్రయిస్తుంటారు. ప్రతి నిత్యం ఎల్బీనగర్-మియాపూర్, ఎంజీబీఎస్-జేబీఎస్, నాగోల్-రాయదుర్గం మూడు కారిడార్లలో దాదాపు 5 లక్షల మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. మెట్రోకు ఉన్న ఆదరణ దృష్ట్యా ఫేజ్-లో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది.

# ఇంజినీరింగ్ కోర్సులకు కొత్త ఫీజులు!

**- కౌన్సెలింగ్ ప్రారంభం నాటికి ఫీజులు ఖరారు చేసేలా చర్యలు**

హైదరాబాద్: రాష్ట్రం లో ఇంజనీరింగ్, ఫార్మసీ,మేనేజ్‌మెంట్, న్యాయవిద్య, ఉపాధ్యాయ విద్యతో ఇత ర వృత్తి కోర్సులకు ఈసారి కొత్త ఫీజులు అమలులోకి రానున్నాయి. రాష్ట్రంలో వృ త్తి విద్యా కోర్సులకు గత మూడేళ్ల క్రితం అమలు చేసిన ఫీజుల కాలపరిమితి 20 2425తో ముగిస్తుంది. ఈ నేపథ్యంలో 2025-26 నుంచి 2027-28 వరకు అమలు కానున్న వృత్తి విద్యా కోర్సుల ఫీ జులను ఈసారి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఖరారు చేయనున్నది. మూడేళ్ల కు ఒకసారి టిఎఎఫ్ఆర్‌సి ఫీజులను స మీక్షించి కొత్త ఫీజులను ఖరారు చే స్తుంది. ఈ మేరకు 2022-23, 2023 -24, 2024-25 విద్యాసంవత్సరాలకు కమిటీ సిఫార్సుల మేరకు 2022 జులైలో ఫీజులను ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.కాగా, 2025-26 నుంచి కొత్త ఫీజులు అమల్లోకి రావాల్సి ఉంది. కళాశాలల్లో మౌలిక వసతులు, అధ్యాపకుల వేతనాలతో కూడిన ఆదాయ, వ్యయాలను పరిగణలోకి తీసుకుని టిఎఎఫ్ఆర్‌సి ఫీజులను ఖరారు చేస్తుంది. ఇప్పుడు టిఎఎఫ్ఆర్‌సి ఖరారు చేసే ఫీజు వచ్చే మూడేళ్లకు అమలవుతుంది. ద్రవ్యోల్బణం ఆధారంగా ఫీజుల పెంపు ఉండే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ప్రైవేట్ యాజమాన్యాలు, అధికారులు అభిప్రాయపడుతున్నారు. మూడేళ్ల క్రితంతో పోల్చితే వృత్తి విద్యా కళాశాలల నిర్వహణ వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ప్రతి కోర్సులో కొంత మేర పెంపు తప్పనిసరిగా కనిపిస్తుందని పేర్కొంటున్నారు.

కౌన్సెలింగ్ ప్రారంభం నాటికి ఫీజులు ఖరారు చేసేలా చర్యలు

వృత్తి విద్యా కోర్సులకు జూన్ లేదా జూలైలో కౌన్సెలింగ్ చేపట్టే అవకాశం ఉన్నందున ఆ సమయానికే ఫీజులను ఖరారు చేసేలా టిఎఎఫ్ఆర్‌సి చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలో కొన్ని కాలేజీల్లో ఫీజు రూ. లక్షకుపైగా ఉండగా, మిగతా కాలేజీల్లో రూ. లక్షలోపు ఉంది. ఈసారి 15 శాతం మేర ఫీజులు పెంచాలని కాలేజీల యాజమాన్యాలు భావిస్తున్నట్లు తెలిసింది.

అందుకు టిఎఎఫ్ఆర్‌సీ ఆమోదం తెలిపితే ఇంజనీరింగ్‌లో వార్షిక ఫీజు కనిష్ఠంగా రూ. 60 వేల నుంచి రూ. 1.70 లక్షలకుపైగా ఉండే అవకాశం ఉన్నది. అంటే ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేయడానికి రూ. 3 లక్షల నుంచి రూ. 8 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో వృత్తి విద్యా కోర్సుల్లో ఫీజుల ఖరారుకు గత మూడేళ్లలో కాలేజీల నిర్వహణ వ్యయంతోపాటు మౌలిక సదుపాయాల విస్తరణ, విద్యా ప్రమాణాల మెరుగుదలకు చేసిన ఖర్చు వివరాలను యాజమాన్యాలు టిఎఎఫ్ఆర్‌సీకి ఇవ్వాలి. యాజమాన్యాలు సమర్పించిన కాలేజీల ఆదాయ వ్యయాల ఆధారంగా టిఎఎఫ్ఆర్‌సీ ఫీజులు ఖరారు చేస్తుంది. రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, న్యాయవిద్య, ఉపాధ్యాయ విద్య తదితర వృత్తి విద్యా కోర్సులకు వచ్చే మూడేళ్లపాటు అమలు చేయాల్సిన ఫీజుల ఖరారుకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టిఎఎఫ్ఆర్‌సి) షెడ్యూల్ విడుదల చేసింది. కళాశాలల యాజమాన్యాలు సమర్పించిన కళాశాలల ఆదాయ వ్యయాలను పరిశీలించి టిఎఎఫ్ఆర్‌సీ ఫీజులను ఖరారు చేయనున్నది.

# పంచాయతీలను స్థానిక సంస్థలుగా కాదు..స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించండి

**- పంచాయతీ ఎన్నికలను వెంటనే నిర్వహించండి**

**- మున్సిపల్ చైర్మన్లను, నగర మేయర్లను ప్రత్యక్షంగా ప్రజలే ఎన్నుకోవాలి-**

**- లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు**

హైదరాబాద్: రాజ్యాంగ స్ఫూర్తిగా స్థానిక సంస్థలుగా కాకుండా స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించి 73 మరియు 74 రాజ్యాంగ సవరణల ద్వారా సంక్రమించిన అధికారాలను, విధులను, నిధులను, సిబ్బందిని వెంటనే బదిలీ చేయాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు డిమాండ్ చేసారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో బహిరంగ లేఖను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులకు, క్యాబినెట్ మంత్రులకు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఈ- మెయిల్ ద్వారా పంపిన వినతి పత్రంలో కోరారు. ఈ నెల చివరి నాటికి సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం పూర్తయి సంవత్సరం కావొస్తుందని అయినా ప్రభుత్వంలో చలనం లేదని ఇంచార్జుల పాలనకు స్వాతి పలికి స్థానిక ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఆయన డిమాండు చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక వ్యవస్థలను నిర్వీర్యం చేసి ఏం. ఎల్.ఏ రాజ్యం నడిచిందని ఇకనైనా 73,74 రాజ్యాంగ సవరణల ద్వారా సంక్రమించిన అధికారాలను, విధులను, నిధులను మరియు సబ్బందినిని పూర్తి స్థాయిలో వెంటనే బదిలీ చేయాలని తుమ్మనపల్లి డిమాండ్ చేశారు. గ్రామ సర్పంచు లాగానే మున్సిపాలిటీలకు చైర్మన్లను నగర పాలక కార్పొరేషన్లకు మేయర్లను ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకొనేలా చట్టాన్ని పునరుద్దరించాలని, పెండింగ్ బిల్లులను పరిష్కరించి చెల్లించాలని, రాష్ట్ర బడ్జెట్లోనే స్థానిక ప్రభుత్వాలకు 50 శాతం నిధులు ఈ బడ్జెట్ లోనే కేటాయించాలని, రాష్ట్ర ఆర్థిక సంఘంను ఏర్పాటు చేయాలని, కేంద్ర ఆర్థిక సంఘం నేరుగా 1/3 వంతు నిధులు స్థానిక ప్రభుత్వాలకు కేటాయించాలని ముఖ్యమంత్రికి పంపిన లేఖలో పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిపేట రవిందర్, శ్రీమతి గాజానని, కార్యదర్శులు మల్లాది కిషోర్,శ్రీనివాస వర్మ, పార్థసారథి, యూత్ ఫర్ బెట్టర్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు శివ రామ కృష్ణ, యువసత్తా రాష్ట్ర కన్వీనర్ వరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జగజ్జేతగా భారత్..
# 'ఈ విజయం యువతరానికి స్ఫూర్తి'

ఖోఖో ప్రపంచ కప్ తొలి ఎడిషన్ లో ఆతిథ్య భారత్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్రామీణ క్రీడ ఖోఖో వరల్డ్ కప్ టోర్నీలో అదిరే ప్రదర్శన చేసింది. అటు పురుషుల విభాగంలో, ఇటు మహిళల విభాగాంలో రెండింటిలోనూ విజేతగా అవతరించింది.

**మోదీ ప్రశంసలు**

ఈ ఖోఖో ప్రపంచ కప్ సొంతం చేసుకోవడంపై దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ క్రమంలోనే భారత జట్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా అభినందించారు. ఈ విజయం యువతరానికి స్ఫూర్తిని ఇస్తుందని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

**అమ్మాయిల దూకుడు**

మహిళల ఫైనల్లో భారత జట్టు 78-40తో నేపాల్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన మన అమ్మాయిలు.. చివరి వరకు జోరు ప్రదర్శించారు. కెప్టెన్ ప్రియాంక ఇంగ్లే, వైష్ణవి మంచిగా రాణించడం వల్ల ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ క్రమంలోనే టైటిల్‌ను



సొంతం చేసుకుంది.

**మొదటి నుంచే ఎటాకింగ్ గేమ్**

పురుషుల విభాగంలో భారత జట్టు 54-36తో నేపాల్‌పై గెలుపొందింది. ప్రారంభంలోనే ఎటాకింగ్ గేమ్ ఆడిన భారత జట్టు 26-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఆ తర్వాత నేపాల్ కాస్త ప్రతిఘటించింది. అయినా దూకుడు కొనసాగించిన భారత్.. చివరికి టైటిల్ ను దక్కించుకుంది.

# అమల్లోకి BCCI కొత్త రూల్స్ -
# ఇకపై ఆటగాళ్లంతా ఒకే బస్సులో!!

భారత క్రికెట్ వ్యవస్థను గాడినపెట్టేందుకు బీసీసీఐ 10 పాయింట్లతో కూడిన నియమావళిని రూపొందించిందని గత వారం రోజులుగా ప్రచారం సాగుతోన్న సంగతి తెలిసిందే.
అయితే దీనిపై బీసీసీఐ అధికారిక ప్రకటన చేయనప్పటికీ, ఆ నిబంధనలను అమలు చేయడం ప్రారంభించినట్లు తెలిసింది.
ఇందులో భాగంగా బీసీసీఐ.. జట్టు ఆటగాళ్ల ప్రయాణాలపై ఆంక్షలు విధించిందని తెలిసింది. ప్లేయర్స్ ఎవరికి కూడా వ్యక్తిగత వాహనాలను సమకూర్చకుండా, ఆటగాళ్లంతా కలిసి ఒకే బస్సులోనే ప్రయాణించేలా ఏర్పాటు చేస్తుందని సమాచారం అందింది. "ప్రాక్టీస్ సెషన్ పూర్తయ్యే వరకు ప్లేయర్స్ అంతా మైదానంలోనే ఉండాలి. అక్కడి నుంచి హోటల్‌కు కలిసే వెళ్లాలి'' అని బీసీసీఐ నియమావళి రూపొందించింది. ఈ మేరకు.. ఇంగ్లాండ్ సిరీస్ కు ఆతిథ్యమివ్వనున్న రాష్ట్ర క్రికెట్ బోర్డు సంఘాలకు ఆదేశాలను జారీ చేసినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.
ఇప్పటికే ఈ ఆదేశాలను తొలి టీ20కు (కోల్‌కతా వేదిక) ఆతిథ్యమిస్తున్న బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అమలు చేసింది. ఈ తొలి టీ20 మ్యాచ్ కోసం ఇప్పటికే భారత్, ఇంగ్లాండ్ జట్లు



అక్కడికి చేరుకున్నాయి. అయితే మ్యాచ్ కు ముందు ప్రాక్టీస్ చేసిన ప్లేయర్స్, సహాయక సిబ్బంది అంతా.. హోటల్ నుంచి ఒకే బస్సులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలోనూ అదే బస్సులో హోటల్ కు వచ్చారు. "భారత జట్టు కోసం ఒక బస్సును మాత్రమే అందుబాటులో ఉంచాం. ఎవరికీ కూడా వ్యక్తిగత వాహనాలు సమకూర్చలేదు. ఒకే బస్సులో ప్రయాణించాలనే నిబంధనకే కట్టుబడి ఉన్నాం" అని బెంగాల్ క్యాబ్ అధ్యక్షుడు స్నేహాశీష్ గంగూలీ వెల్లడించారు.

# లఖ్‌నవూ కెప్టెన్ గా పంత్
# అఫీషియల్ అనౌన్స్ మెంట్!

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ విషయంలో ఊహించినట్టుగానే జరిగింది. టీమ్‌ఇండియా యంగ్ ప్లేయర్ రిషభ్ పంత్ లఖ్‌నవూ కెప్టెన్ గా ఎంపికయ్యాడు. అతడిని జట్టు సారథిగా నియమించినట్లు ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గొయెంకా అధికారికంగా ఖరారు చేశారు.
పంత్ తో పాటు కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సంజీవ్ గోయెంకా ఈ ప్రకటన చేశారు. భవిష్యత్? లో పంత్ ఐపీఎల్? బెస్ట్ కెప్టెన్ ?గా ఎదుగుతాడని సంజీవ్ ధీమా వ్యక్తం చేశారు.
కాగా, ఐపీఎల్ మెగా వేలంలో రిషబ్ పంత్ (రూ.27 కోట్లు) మెగా లీగ్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడుపోయిన ఆటగాడిగా నిలిచిన సంగతి తెలిసిందే. దీంతో పంత్ కే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం మొదటి నుంచి క్రికెట్ వర్గాల్లో ప్రచారం సాగింది. ఇప్పుడు దాన్నే నిజం చేస్తూ అఫీషియల్ గా ప్రకటించారు.
ఇక పంత్? కన్నా ముందు లఖ్‌నవూ జట్టుకు కేఎల్ రాహుల్, కృనాల్ పాండ్య, నికోలస్ పూరన్ కెప్టెన్ గా వ్యవహరించారు. కాగా, 2016లో ఐపీఎల్ అరంగేట్రం చేసిన పంత్... అప్పటి నుంచి దిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడాడు. 110 మ్యాచులు ఆడి 35.31 సగటుతో 3,284 రన్స్ సాధించాడు. అందులో ఓ శతకం, 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2021లో కెప్టెన్ గానూ సెలెక్ట్ అయ్యాడు. అదే సీజన్ లో తన జట్టును ప్లే ఆఫ్స్ కు చేర్చాడు. 2022, 2024 సీజన్ లోనూ సారథిగా వ్యవహరించాడు. ఇక ఇప్పుడు ఐపీఎల్ 2025 మెగా వేలంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పంత్ ను అత్యధిక ధరకు సొంతం చేసుకుంది. లఖ్‌నవూ జట్టు ఐపీఎల్ 2025 వేలానికి ముందు నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్ తో పాటు అన్ క్యాప్డ్



స్టార్స్ మోషిన్ ఖాన్, ఆయుష్ బదోనీని రిటైన్ చేసుకుంది. గత సీజన్ లో 14 మ్యాచుల్లో ఏడింటిలో విజయం సాధించి 14 పాయింట్లతో ఏడో స్థానంలో సరిపెట్టుకుంది.
లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు ఇదే :
బ్యాటర్స్ : మర్ క్రమ్, డేవిడ్ మిల్లర్, ఆయుశ్ బదోని (రిటైన్), హిమ్మత్ సింగ్, మాథ్యూ బ్రీట్జ్కే.
వికెట్ కీపర్లు: రిషబ్ పంత్, నికోలస్ పూరన్ (రిటైన్), ఆర్యన్ జుయల్.
ఆల్ రౌండర్లు: అబ్దుల్ సమద్ (స్పిన్), మిచెల్ మార్ష్ (పేస్), షాబాజ్ అహ్మద్ (స్పిన్), యువరాజ్ చౌదరి (స్పిన్), రాజవర్ధన్ హంగర్గేకర్ (పేస్), అర్షిన్ కులకర్ణి (పేస్).
స్పిన్నర్లు: రవి బిష్ణోయ్ (రిటైన్), ఎం సిద్ధార్థ్, దిగ్వేష్ సింగ్.
ఫాస్ట్ బౌలర్లు: మయాంక్ యాదవ్ (రిటైన్), మొహ్సిన్ ఖాన్ (రిటైన్), ఆకాశ్ దీప్, అవేశ్ ఖాన్, ఆకాష్ సింగ్, షమర్ జోసెఫ్, ప్రిన్స్ యాదవ్.

# జైస్వాల్, పంత్‌కు నో ఛాన్స్! ఛాంపియన్స్
# ట్రోఫీ ఆడే భారత తుది జట్టు ఇదే!

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి కౌంట్‌డౌన్ మొదలైంది. మరో 30 రోజుల్లో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. ఇప్పటికే ఈ టోర్నీలో బరిలోకి దిగే జట్ల వివరాలను ఆయా దేశాల క్రికెట్ బోర్డులు ప్రకటిస్తున్నాయి.
బీసీసీఐ సైతం రోహిత్ శర్మ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది.
ఎలాంటి సంచలనాలకు తావివ్వకుండా అంచనాలకు తగ్గట్లుగా బీసీసీఐ జట్టును ఎంపిక చేసింది. స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇచ్చింది. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ అనంతరం గాయంతో జట్టుకు దూరమైన మహమ్మద్ షమీ.. సుదీర్ఘ విరామం తర్వాత ఎట్టకేలకు జట్టులో చోటు దక్కించుకున్నాడు.
ఫిబ్రవరి 19న పాకిస్థాన్ వేదికగా ఈ మినీ ప్రపంచకప్‌కు తెరలేవనుంది. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌తో భారత్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఫిబ్రవరి 23న పాకిస్థాన్‌తో తలపడనుంది. హైబ్రిడ్ మోడల్‌లో ఈ టోర్నీ జరగుతుండగా.. భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోనే జరగనున్నాయి.
దుబాయ్ పిచ్‌లకు తగ్గట్లు టీమిండియా కాంబినేషన్ ఉండనుంది. స్పిన్‌కు అనుకూలంగా ఉండే దుబాయ్ వికెట్‌పై స్పిన్నర్లకు ప్రాధాన్యత దక్కనుంది. ఓపెనర్లుగా రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ బరిలోకి దిగే అవకాశం ఉంది. వన్డే ప్రపంచకప్ 2023లో ఈ ఇద్దరే జట్టుకు ఓపెనర్లుగా వ్యవహరించారు. అయితే శుభ్‌మన్ గిల్ ఫామ్ సరిగ్గా లేకపోవడంతో పాటు లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కోసం ఆలోచన చేస్తే యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా బరిలోకి దిగే ఛాన్స్ ఉంది.
మూడో స్థానంలో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చేయనున్నాడు. గిల్, యశస్వి జైస్వాల్ ఇద్దరినీ ఆడిస్తే కోహ్లీ నాలుగో స్థానంలో బ్యాటింగ్



చేయాల్సి వస్తుంది. అప్పుడు గిల్ మూడో స్థానంలో ఆడుతాడు. అలా జరగకపోతే మాత్రం నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను ఆడించనున్నారు. వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్‌కే తొలి ప్రాధాన్యత దక్కనుంది. అయితే ఇటీవల పంత్ సూపర్ ఫామ్‌లో ఉండటం.. లెఫ్టార్మ్ బ్యాటర్ కావడం అతనికి కలిసొచ్చే అంశం.
ఈ లెక్కన ఆలోచిస్తే పంత్‌కే తొలి ప్రాధాన్యత ఇస్తారు. పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఆరో స్థానంలో ఆడనున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్ల కోటాలో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ బరిలోకి దిగుతారు. అక్షర్ పటేల్ బెంచ్‌కే పరిమితం కావాల్సి ఉంటుంది. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ బరిలోకి దిగుతాడు. పేసర్లుగా జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమీలు ఆడుతారు. ఈ ఇద్దరిలో ఎవరికి ఫిట్‌నెస్ సమస్యలున్నా.. అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వస్తాడు. ముగ్గురు పేసర్లతో ఆడాలనుకుంటే వాషింగ్టన్ సుందర్ బెంచ్‌కు పరిమితమవుతాడు. అయితే దుబాయ్ పిచ్‌పై టీమిండియా ఎక్స్‌ట్రా స్పిన్నర్‌తోనే బరిలోకి దిగే అవకాశం ఎక్కువగా ఉంది.

# అతన్నే ఓపెనర్‌గా ఆడించాలి..
# కోహ్లీని డీమోట్ చేయాలి: అశ్విన్


ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో బరిలోకి దిగే టీమిండియా కాంబినేషన్‌పై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఓపెనర్‌గా కెప్టెన్ రోహిత్ శర్మకు జతగా లెఫ్టార్మ్ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను ఆడించాలని సూచించాడు.
ఇక స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని మూడో స్థానంలో కాకుండా నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు పంపించాలని అభిప్రాయపడ్డాడు.
ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో బరిలోకి దిగే భారత జట్టును గత శనివారమే ప్రకటించిన విషయం తెలిసిందే. రోహిత్ శర్మ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను చీఫ్ సెలెక్టర్ అజిత్ అగర్కార్ వెల్లడించాడు. స్టార్ పేసర్ మహమ్మద్ షమీ రీఎంట్రీ ఇవ్వగా.. మహమ్మద్ సిరాజ్‌పై వేటు పడింది. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వికెట్ కీపర్లుగా రిషభ్ పంత్, కేఎల్ రాహుల్‌లకు అవకాశం దక్కింది.
ఓపెనర్‌గా యశస్వి..
ఈ టోర్నీలో బరిలోకి దిగాల్సిన టీమ్ కాంబినేషన్‌పై అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా చర్చించాడు. యశస్వి జైస్వాల్ ఎంపికకు గల కారణాన్ని కూడా వెల్లడించాడు. 'ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లను వాడుకోవడం జట్టు బాధ్యత. యశస్వి జైస్వాల్ గత 18 నెలలుగా సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. అంతేకాకుండా అతను లెఫ్టార్మ్ బ్యాటర్. జట్టుకు లెఫ్ట్ రైట్ కాంబినేషన్ ఇవ్వగలడు. అందుకే రోహిత్ శర్మకు జతగా యశస్వి జైస్వాల్‌నే ఓపెనర్‌గా ఆడించాలి.
అప్పుడే జట్టుకు సమతూకం వస్తుంది. లెఫ్ట్-రైట్ కాంబినేషన్‌తో ప్రత్యర్థి బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్ అడ్జస్ట్ చేసుకోవాల్సి వస్తుంది. ఇది బ్యాటర్లకు మరిన్ని పరుగులు చేసే అడ్వాంటేజ్‌ను ఇస్తోంది.
నాలుగో స్థానంలో కోహ్లీ..
శుభ్‌మన్ గిల్‌ను ఫస్ట్ డౌన్‌లో ఆడించాలి. విరాట్ కోహ్లీని నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు పంపించాలి. ఎందుకంటే కోహ్లీ నాలుగో స్థానంలో ఆడటం ద్వారా అటు జట్టుకు ఇటు అతని వ్యక్తిగత ప్రదర్శనకు ఉపయోగపడుతోంది. పరిస్థితులకు తగ్గట్లు ఆడటంలో కోహ్లీని మించినవారు లేరు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తే.. త్వరగా వికెట్లు పడితే యాంకర్ రోల్ పోషించగలడు.
మంచి ఆరంభం లభిస్తే దూకుడుగా ఆడి జట్టుకు కావాల్సిన పరుగులు అందించగలడు. ఐదో స్థానంలో వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ లేదా రిషభ్ పంత్‌ను బరిలోకి దించాలి. ఆరో స్థానంలో పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను ఆడించాలి. ఏడో స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్లు అయిన అక్షర్ పటేల్, జడేజా ఒకరికి అవకాశం ఇవ్వాలి.



సుందర్‌తో సమతూకం..
8వ స్థానంలో మాత్రం స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఆడించాలి. అతన్ని తీసుకోవడం ద్వారా జట్టు సమతూకం వస్తుంది. బ్యాటింగ్ డెప్త్‌తో పాటు బౌలింగ్ ఆప్షన్ ఉంటుంది. పేసర్లుగా అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రాలను ఆడించాలి. సిరాజ్‌పై వేటు వేయడం ఆశ్చర్యానికి గురి చేసింది. 'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.
అందుకే గిల్‌కు వైస్ కెప్టెన్సీ..
భవిష్యత్తు సారథిగా తీర్చిదిద్దేందుకే శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్సీ ఇచ్చి ఉంటారని అశ్విన్ అభిప్రాయపడ్డాడు.'వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను నియమించడం సరైందా కాదా? అని నేను చెప్పడం లేదు. కానీ గత సిరీస్‌లో అతను వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. టెస్ట్‌ల్లో కూడా కొన్ని మ్యాచ్‌లకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇది తప్పు కూడా కావచ్చు. అయితే భవిష్యత్తు సారథిగా తీర్చిదిద్దేందుకే మేనేజ్‌మెంట్ అతన్ని వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసి ఉండవచ్చు.'అని అశ్విన్ తెలిపాడు.

# 'అతడు నా ఎమోషన్స్ తో ఆడుకున్నాడు
# - నేను ఏడ్చేశాను!' - సచిన్ తెండుల్కర్

16 నవంబర్, 2013.. భారత క్రికెట్ అభిమానులు ఎప్పటికీ మర్చిపోలేని రోజు ఇది. 24 ఏళ్ల పాటు తన ఆటతీరుతో టీమిండియాను తన భుజాన్న మోసిన గాడ్ ఆఫ్ క్రికెట్ సచిన్ తెండుల్కర్ ఆటకు వీడ్కోలు పలికిన రోజు ఇది.
హోం గ్రౌండ్ వాంఖడే స్టేడియంలో సొంత అభిమానుల మధ్య వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్‌తో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. అయితే ఆ రోజు జరిగిన ఓ సంఘటన తనను చాలా బాధపెట్టినట్లు తెలిపాడు సచిన్. తన ఎమోషన్స్ తో ఓ వ్యక్తి ఆడుకున్నాడని ఆరోపించాడు. వాంఖడే స్టేడియం 50 ఏళ్ల వార్షికోత్సవ సంబరాల ఈవెంట్ లో ఈ విషయాన్ని తెలిపాడు.
ఎప్పటికీ మర్చిపోలేను
కెరీర్ చివరి మ్యాచ్ ను తన తల్లి సమక్షంలో ఆడటం ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పిన సచిన్.. ఆ అవకాశాన్ని కల్పించిన బీసీసీఐ ధన్యవాదాలు తెలిపాడు. "సిరీస్ గురించి ప్రకటించగానే, నేను బీసీసీఐని కలిసి ఓ రిక్వెస్ట్ చేశాను. నా లాస్ట్ మ్యాచ్ ను ముంబయిలో ఆడించాలని విజ్ఞప్తి చేశాను. ఎందుకంటే నేను 24 ఏళ్ల పాటు ఇండియా కోసం ఆడాను. మొత్తంగా 30 ఏళ్ల వరకు ఆడాను. కానీ మా అమ్మ నేను ఆడటం ఎప్పుడూ లైవ్ లో చూడలేదు. నా ఫేర్ వెల్ మ్యాచ్ సమయంలో మా అమ్మ ఆరోగ్యం బాగోలేదు. ఎక్కడికీ ప్రయాణించే స్థితిలో లేదు. అదే వాంఖడే స్టేడియం అయితే మా అమ్మ రావడానికి వీలుగా ఉంటుంది. అందుకే వాంఖడేలో నా చివరి మ్యాచ్ ఆడతానని బీసీసీఐకి రిక్వెస్ట్ చేశాను. వాళ్లు దాన్ని అంగీకరించారు." అని సచిన్ పేర్కొన్నాడు. నా ఎమోషనల్ తో



ఆడుకున్నాడు అయితే ఆ మ్యాచ్‌లో బ్రాడ్ కాస్ట్ ప్రొడ్యూసర్ తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడని గుర్తు చేసుకున్నాడు సచిన్. అతడు తన ఎమోషన్స్‌తో ఆడుకున్నాడని పేర్కొన్నాడు. "నా బ్యాటింగ్‌కు దిగిన సమయంలో వెస్టిండీస్ జట్టు నన్ను చాలా గౌరవించింది. స్టేడియంలోని ప్రేక్షకులు కూడా ఎంతో మంచిగా స్వాగతించారు. అప్పుడు నేను ఎమోషన్ కు గురయ్యాను. నా కళ్లలో నీరు తిరిగాయి. కానీ నేను ఆటపై ఫోకస్ చేయాలి. అప్పుడు లాస్ట్ ఓవర్ కు ముందు స్టేడియంలోని బిగ్ స్క్రీన్ ను చూశాను. అప్పుడు మా అమ్మతో పాటు నా భార్య , పిల్లల్ని బిగ్ స్క్రీన్‌లో చూపించారు. దీంతో నేను మరింత ఎక్కువ ఎమోషన్ అయ్యాను. బ్రాడ్ కాస్ట్ చేసిన ప్రొడ్యూసర్ వెస్టిండీస్ కు సపోర్ట్ గా అలా చేశాడేమో అనిపించింది. అతడు నా ఎమోషన్స్ తో ఆడుకున్నాడు.బహుశా అతడికి విండీస్ పాస్‌పోర్ట్ ఇచ్చిందేమే?" అని సచిన్ నాటి సంఘటనలను గుర్తు చేసుకున్నాడు.

# స్టంప్ తో బ్యాటర్ పై బౌలర్ దాడి

క్రికెట్ మైదానంలో ప్లేయర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడం సహజమే. కొన్ని సందర్భాల్లో అవి మితిమీరి ఆటగాళ్లు కొట్టుకునే తీవ్ర స్థాయికి చేరుకుంటుంటాయి.
తాజాగా అలాంటి సంఘటనే ఒకటి చోటు చేసుకుంది. మ్యాచ్ లో ఓ బౌలర్ ఆగ్రహానికి గురై స్టంప్ తో బ్యాటర్ ను బాదాడు. ఆపై అతడి ముక్కును తీవ్రంగా గాయపరిచాడు. ఇంతకీ ఈ సంఘటన ఎక్కడ, ఎవరి మధ్య చోటు చేసుకుందంటే?
మహారాష్ట్రలోని భివండి తాలూకా, అంజూర్ గ్రామంలో ఈ కొట్లాట జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. అంజూర్ గ్రామంలోని మయూర్ షాలిక్, విరాజ్ శ్యామ్ అనే ఇద్దరు క్రికెటర్లు స్థానికంగా ఉండే సిద్ధి వినాయక్ క్రికెట్ గ్రౌండ్ లో మ్యాచ్ ప్రాక్టీస్ చేశారు. ఆ సమయంలో విరాజ్ బ్యాటింగ్ చేస్తుండగా, మయూర్ బౌలింగ్ కు దిగాడు. అయితే మయూర్ స్లోగా బౌలింగ్ చేస్తుండటం వల్ల.. 'ఎందుకు అంత స్లోగా బంతులు సంధిస్తున్నావ్? నీకు బౌలింగ్ చేత కాదా?' అని అసంతృప్తికి గురైన విరాట్ బౌలర్ ను ప్రశ్నించాడు. దీంతో కోపానికి గురైన మయూర్ విరాజ్ పై కొట్లాటకు దిగాడు. అంతటితో ఆగకుండా స్టంప్ తీసుకుని అతడిపై దాడికి దిగాడు. విరాట్ ముక్కుపై కూడా కొట్టాడు. దీంతో అతడికి తీవ్రంగా గాయాలయ్యాయి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**